## విలేకరులు కావలెను
కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను..
తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 9700370499
సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు


# విజయ సారథి
RNI / APTEL/2015/64956
తెలుగు దినపత్రిక

## టీవీ రిపోర్టర్లు కావలెను
VISION TV
A.P
రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను.
ఆసక్తి ఉన్న వారు వెంటనే సం॥ సెల్ నెం: 9700370499
యండి. పి.వెంకటేశ్వర్లు

చీఫ్‌ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | ఆదివారం 23-02-2025 | సంపుటి : 11 | సంచిక : 45 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.

# మిర్చి రైతుల సమస్యలపై సీఎం చంద్రబాబు కీలక సమావేశం



అమరావతి, ఫిబ్రవరి 22: మిర్చి రైతులు, యార్డు ట్రేడర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం సమావేశం నిర్వహించారు. మిర్చి రైతుల సమస్యలు, ప్రస్తుత మిర్చి ధరలపై ప్రధానంగా చర్చించనున్నారు. ఈ సమావేశానికి వ్యవసాయ శాఖ, సహచర మార్కెటింగ్ శాఖ, పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గురుతు రాజశేఖర్, వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు, వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత, వ్యవసాయశాఖకు సంబంధించి అధికారులు, ట్రేడర్లు సమావేశానికి హాజరయ్యారు. ముఖ్యంగా మిర్చి ధర గత కొంతకాలంగా తగ్గుతూ వస్తోంది.మిర్చి ధర నిర్ణయించాలని వైఎస్సార్సీపీ అధినేత జగన్ డిమాండ్ చేశారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రితో భేటీ అయి రాష్ట్రంలో మిర్చి రైతుల సమస్యలపై వివరించడం, దానిపై కేంద్రం వెంటనే స్పందించి రాష్ట్రంలో చిల్లి ధర పరిస్థితిపై స్పందించి.. కేంద్రం నుంచి సహాయం అందిస్తామని చెప్పడంతో ఈరోజు గుంటూరు మిర్చి యార్డు ట్రేడర్లు, మిర్చి కొనుగోలు చేసే వర్తకులతో సీఎం కీలక సమావేశం నిర్వహించారు.ఏపీ నుంచి మిర్చి ఎగుమతి అయ్యే శ్రీలంక, మలేషియా, చైనా దేశాల్లో కూడా మిర్చిని సొంతంగా పండించడంతో మిర్చి ధర తగ్గిందని భావించినప్పటికీ అక్కడ పంట సరిగ్గా రాకపోవడంతో రానున్న రోజుల్లో మిర్చి ధర భారీగా పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ విషయాలన్నింటినీ ట్రేడర్స్‌కు వివరించడంతో పాటు, రైతులకు ట్రేడర్స్ ఇబ్బందులు కలిగించ వద్దని, సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరిస్తుందని సీఎం చెప్పనున్నట్లు తెలిస్తోంది. అయితే మిర్చి ధర నిర్ణయిస్తే ఆ ధరకే కొంటామని ట్రేడర్లు చెప్పే అవకాశం ఉన్నందున రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని వైపుల నుంచి చర్యలు తీసుకుంటోంది. అటు ముఖ్యమంత్రి స్వయంగా ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వంతో చర్చించారు. అలాగే ఈరోజు ట్రేడర్లతో కూడా సీఎం భేటీ అవడంతో మిర్చి ధరల విషయంలో ఎటువంటి హెచ్చుతగ్గులు లేకుండా చూసే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని భావించవచ్చు.ఈ ఏడాది రెండు లక్షల ఎకరాల వరకు కూడా మిర్చి పంటను తగ్గించి ప్రత్యామ్నాయ పంటలను వేశారు రైతులు. ఆ కొరత ఉన్నప్పటికీ గత ఏడాది నుంచి గోడాన్‌లో ఉన్న మిర్చి అంతా కూడా అమ్ముడుపోయిన పరిస్థితి. ఏరోజు మిర్చి ఆరోజు కొనుగోలు జరుగుతోందని, మిర్చి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి నైతిక స్థైర్యాన్ని ఇవ్వడంలో భాగంగా వర్తకులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం నిర్వహించినట్లు సమాచారం.

# ఆర్ఎస్ఎస్‌పై ప్రధాని ప్రశంసలు..

## దేశం కోసం జీవించాలన్న స్ఫూర్తి రగిలించిందని వ్యాఖ్య


న్యూఢిల్లీ: : దేశం కోసం జీవించాలన్న స్ఫూర్తిని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తనలో కలిగించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శుక్రవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన 98వ అఖిల భారత్ మరాఠీ సాహిత్య సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఛత్రపతి శివాజీ పట్టాభిషేకం జరిగి 350 ఏళ్లైన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆర్ఎస్ఎస్ ఏర్పడి శతాబ్దం అయిన నేపథ్యంలో మోదీ ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. తనతో పాటు దేశంలోని లక్షలాది మందిలో దేశం కోసం జీవించాలన్న తపన



ఆర్ఎస్ఎస్ కలిగించిందని వ్యాఖ్యానించారు మహారాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలపై కూడా ప్రధాని ప్రశంసలు కురిపించారు. "రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వెనక మరాఠీ మూలాలున్న వ్యక్తి ఉన్నారన్న వాస్తవం మాకందరికీ ఎంతో గర్వకారణం. ఆర్ఎస్ఎస్ ఏర్పడి 100 సంవత్సరాలు అయ్యింది. వటవృక్షంలా విస్తరించింది" అని అన్నారు. ఆర్ఎస్ఎస్ కారణంగానే తనకు మరాఠీ భాష, సంస్కృతి, సంప్రదాయాలతో అనుబంధం ఏర్పడిందని అన్నారు. కొత్త తరాలకు భారతీయ సంస్కృతి, విలువలను పరిచయం చేసేందుకు ఆర్ఎస్ఎస్ గత 100 సంవత్సరాలుగా సాంస్కార యజ్ఞం చేస్తోందని వ్యాఖ్యానించారు.ఇక భారతీయ భాషల మధ్య ఎటువంటి శత్రుత్వ భావన లేదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. భారతీయ భాషలు పరస్పరం సుసంపన్నమయ్యాయని అన్నారు. ధైర్యస్థైర్యాలు, అందం, సున్నితత్వం, సమానత్వం వంటి అనేక భావాలతో కూడి పూర్తిస్థాయి భాష మరాఠీ అని వ్యాఖ్యానించారు. భాష పేరిట ప్రజలను విడగొట్టే ప్రయత్నం జరిగిన ప్రతిసారీ, భారతీయ ఉమ్మడి భాషా వారసత్వం తగిన సమాధానం ఇచ్చిందని గుర్తు చేశారు. తప్పుడు భావనలకు దూరం జరిగి అన్ని భాషలను సంపన్నం చేయాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. త్రిభాషా విద్యావిధానాన్ని తమపై రుద్దే ప్రయత్నం జరుగుతోందని తమిళనాడు సీఎం ఆరోపించిన నేపథ్యంలో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

# గ్రూప్ 2 పరీక్షలు యథాతథం.. వాయిదా వేయలేం

ఆంధ్రప్రదేశ్ గ్రూప్ 2 పరీక్షలు రేపు (ఫిబ్రవరి 23న) యథాతథంగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. ఇటీవల ఈ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు వచ్చిన వార్తలపై ఏపీపీఎస్సీ క్లారిటీ ఇచ్చింది. కమిషన్ తెలిపిన ప్రకారం, ఓఒఅ కోడ్ అమలులో ఉన్నందున గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు ప్రయోజనం కల్పించే



నిర్ణయాలను తీసుకోవడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కమిషన్ సూచించింది. గ్రూప్ 2 పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరీక్షా కేంద్రాలు, సమయాలు, ఇతర వివరాలను అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్లలో చూసుకోవాలని కమిషన్ తెలిపింది. ఏపీపీఎస్సీ తెలిపిన ప్రకారం ఓఒఅ కోడ్ అమలులో ఉన్నందున, ఈ సమయంలో గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం కష్టమని కమిషన్ పేర్కొంది. ఈ కోడ్ ప్రకారం ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, పరీక్షలు వాయిదా వేయడం వంటి చర్యలు తీసుకోవడం నిషిద్ధం. అందువల్ల గ్రూప్ 2 పరీక్షలను వాయిదా వేయడం సాధ్యం కాదని కమిషన్ స్పష్టం చేసింది. ఈ ప్రకటనపై గ్రూప్ 2 అభ్యర్థులు వివిధ రకాలుగా స్పందిస్తున్నారు. ఈ ఎగ్జామ్ కోసం ప్రిపేర్ అయిన అభ్యర్థులు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తుండగా, సరిగా ప్రిపేర్ కానీ వారు మాత్రం నిరాశపడుతున్నారు

# కుంభమేళాలో నడ్డా పవిత్ర స్నానం


ప్రయాగరాజ్,ఫిబ్రవరి22: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ లో జరుగుతున్న ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభమేళా ముగింపు దశకు చేరుకుంది. మరో



ఐదు రోజుల్లో మహాకుంభమేళా ముగియనుంది. ఈ క్రమంలో గంగ, యమున, సరస్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు చేసేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. 45 రోజుల పాటు జరిగే ఈ కుంభమేళాకు సామాన్య భక్తులతోపాటు ప్రముఖులు కూడా తరలివస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు ఇప్పటికే త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించిన విషయం తెలిసిందే. తాజాగా కేంద్ర మంత్రి జేపీ నడ్డా మహాకుంభమేళాను సందర్శించారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం అక్కడ ప్రత్యేక పూజలు చేశారు.

# అమరావతి పనుల ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్

అమరావతి, ఫిబ్రవరి 22: రాజధాని అమరావతి పనులు ఎప్పుడెప్పుడు ప్రారంభమవుతాయా అని ఎదురుచూస్తున్న వేళ కీలక అప్డేట్ వచ్చేసింది. మార్చి 15 నుంచి రాజధాని పనులు ప్రారంభం



కానున్నాయి. ఏప్రిల్ మొదటి వారం నుంచి అమరావతిలో 30 వేల మంది కార్మికులు పనులు చేస్తారని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో టెండర్లు ఖరారు ఆలస్యం అయ్యింది. టెండర్లు పిలుచుకోవచ్చు కానీ ఖరారు చేయవద్దని ఈసీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు దాదాపు 62 పనులకు సీఆర్డీఏ, ఏడీసీ టెండర్లను పిలిచింది. సుమారు 40 వేల కోట్ల విలువైన పనులకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. మరో 11 పనులకు త్వరలో టెండర్లు పిలువనున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని అమరావతి నిర్మాణాన్ని ప్రాధాన్య ప్రాజెక్టు తీసుకుంది. అందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ స్వయంగా అమరావతి ప్రాంతాల్లో పర్యటించి అక్కడ నిలిచిపోయిన పనులను పరిశీలించారు. తరువాత చెన్నై ఐఐటీ, హైదరాబాద్ ఐఐటీలకు చెందిన నిపుణుల బృందం అమరావతి ప్రాంతాన్ని సందర్శించారు. అమరావతిలో సెక్రటేరియెట్, అసెంబ్లీ వంటి ఐకానిక్ భవనాల పటిష్టతపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేశారు. ఇక్కడ నిర్మాణాలకు ఎలాంటి డోకా లేదంటూ ఐఐటీ బృందం నివేదిక ఇచ్చింది.అలాగే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్స్, ఐఏఎస్, ఐపీఎస్ భవనాలు పటిష్టంగా ఉన్నాయని రిపోర్ట్ ఇచ్చారు. దాదాపు 40 వేల కోట్లకు సంబంధించి 62 పనులపై మార్చి 15 నుంచే శ్రీకారం చుట్టనున్నారు. మిగిలిన 11 పనులకు త్వరలో టెడర్లను పూర్తి చేసి రెండున్నరేళ్లలో అమరావతి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని నిర్ణయం : జగన్

కర్నూలు..వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని ఆయన నిర్ణయించుకున్నారు. జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడంపై వైసీపీ కీలక అప్డేట్ ఇచ్చింది.బడ్జెట్ సమావేశాలకు పార్టీ అధినేత జగన్‌తో పాటు, ఎమ్మెల్యేలు సైతం హాజరుకానున్నట్టు ఆ పార్టీ ప్రకటించింది.అధికారం కోల్పోయిన తర్వాత జగన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు కేవలం శాసనసభ్యులుగా ప్రమాణస్వీకారం చేసేందుకు మాత్రమే అసెంబ్లీకి వెళ్లారు. అనంతరం జరిగిన




అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ పూర్తి దూరంగా ఉంది.తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని.. సాధారణ ఎమ్మెల్యేగానే తనకు సమయం కేటాయిస్తే అసెంబ్లీలో గళం వినిపించలేమని జగన్ పేర్కొంటూ వస్తున్నారు.ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీ సమావేశాలకు వెళ్తామని జగన్ పలు సందర్భాల్లో చెప్పడం జరిగింది.అయితే కూటమి ప్రభుత్వం తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టనుండటంతో జగన్ తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఈ క్రమంలోనే జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావాలని భావిస్తున్నారు.ఎన్నికల సమయంలో భారీ హామిలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం , ఇప్పుడు ఆ హామీలను అమలు చేయడానికి నిధులు లేవని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. సూపర్ సిక్స్ అమలు సాధ్యంపై చంద్రబాబు సైతం అసెంబ్లీలోనే తేల్చేశారు. దీంతో బడ్జెట్‌లో సూపర్ సిక్స్ అమలు వాటి కేటాయింపులపై నిలదీయడానికే జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకానున్నారని తెలుస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో జగన్ అసెంబ్లీకి రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. జగన్‌తో పాటుగా వైసీపీ ఎమ్మెల్యేలు కూడా సోమవారం అసెంబ్లీకి హాజరుకానున్నారు. బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఇప్పటికే జగన్ తమ పార్టీ ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేసినట్టు తెలుస్తోంది.

# శక్తికాంత దాస్‌కు ప్రమోషన్

## ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీ-2 గా నియామకం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి22: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ-2గా నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ క్యాబినెట్ ఆమోదించింది. శక్తికాంత దాస్ భాద్యతలు చేపట్టినప్పటి నుంచి ఆయన నియమాకం అమల్లోకి వస్తుంది. ప్రధానమంత్రి టర్మ్ వరకు కానీ తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. పీకే మిశ్రా 2019 సెప్టెంబర్ 11 నుంచి ప్రధానమంత్రికి పర్సనల్ సెక్రటరీగా ఉన్నారు. ఆరేళ్ల పాటు ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేసిన శక్తికాంత దాస్ గత ఏడాది డిసెంబర్‌లో పదవీ విరమణ చేశారు. దీంతో ఆర్బీఐ 26వ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బాధ్యతలు స్వీకరించారు. 67 ఏళ్ల శక్తికాంత దాస్ 2018లో ఊర్జిత్ పటేల్ అకస్మాత్తుగా రాజీనామా చేయడంలో ఆర్బీఐ గవర్నర్ గవర్నర్ బాధ్యతలు చేపట్టారు. 1980 తమిళనాడు ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దాస్ ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్ కాలేజీలో మాస్టర్ డిగ్రీ చేశారు. బర్మింగ్‌హామ్ యూనివర్శిటీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. 2016 నవంబర్‌లో పెద్దనోట్లను రద్దు చేసినప్పుడు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా శక్తికాంతదాస్ ఉన్నారు. 2017 జూలై 1 నుంచి పలు ప్రత్యక్ష పన్నులు జీఎస్టీలో విలీనం చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. 2021లో ఆర్బీఐ గవర్నర్‌గా ఆయన పదవికాలం



# సంపాదకీయం

ఆదివారం 23-02-2025

## ఇండియానే ఊపేస్తున్న చావా...

ఒక్క సినిమా.. ఇప్పుడు ఇండియాని కదిలిస్తోంది. ఒక్కడి చరిత్ర.. మరాఠాలందరినీ భావోద్వేగానికి గురిచేస్తోంది. మరాఠా రాజు ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవితకథతో తెరకెక్కిన ఛావా.. సినీ ప్రియుల్నే కాదు భారతీయులందరినీ కదిలిస్తోంది. తెరపై శంభాజీని చూసి.. ప్రతి ఒక్కరూ ఏడ్చేస్తున్నారు. శంభాజీ వీరత్వాన్ని తలచుకొని.. భావోద్వేగానికి గురవుతున్నారు. కానీ.. బొమ్మ పడ్డాక లెక్క మారిపోయిందఛావా.. ఇండియాలో లేటెస్ట్ సెన్సేషన్! అంతకుమించి.. సినీ లవర్స్‌కి, ముఖ్యంగా మరాఠాలందరికీ గట్టిగా కనెక్ట్ అయిన ఎమోషన్. కొన్ని కొన్ని సార్లు.. కొన్ని సినిమాలు ఎలాంటి అంచనాల్లేకుండానే రిలీజ్ అయిపోతుంటాయ్. థియేటర్లో బొమ్మ పడ్డాకే.. దాని వెయిట్ ఏంటో తెలుస్తుంది. ఇప్పుడు టాకీస్‌లో నడుస్తున్న ఛావా కూడా అలాంటిదే! మూవీ టాక్.. ముందు టాకీస్ దాటింది. తర్వాత స్టేట్ బోర్డర్స్ దాటింది. సోషల్ మీడియాలో అయితే.. ఇంటర్నెట్ బారియర్స్‌ని బద్దలుకొట్టి.. ఛత్రపతి శంభాజీ మహారాజ్ చరిత్రని అందరికీ తెలిసేలా చేస్తోంది.ఛావా సినిమాని.. ఎవరూ ఓ సినిమాలా చూడట్లేదు. చూసిన ప్రతి ఒక్కరూ.. సినిమాతో ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతున్నారు. ఛత్రపతి శివాజీ వీరత్వాన్ని, ఆయన వారసుడి పరాక్రమాన్ని తెరపై చూస్తూ.. మళ్లీ చరిత్రను గుర్తు చేసుకుంటున్నారు. భావోద్వేగానికి గురవుతున్నారు. ఛత్రపతి శంభాజీ మహరాజ్‌ని.. మరాఠాలు తమ ఆత్మగౌరవానికి ప్రతీకగా చూస్తున్నారు. ఆ రోజుల్లో.. మొఘలులతో జరిగిన పోరాటం, మరాఠాల వీరత్వం, శంభాజీ పరాక్రమం, ఆయన అనుభవించిన నరకం, చేసిన త్యాగం.. ఇలా ప్రతి ఎలిమెంట్‌తో ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతున్నారు. థియేటర్‌లో కూర్చున్నచోటే నిలబడి.. నివాళు లర్పిస్తున్నారు. భావోద్వేగానికి గురవుతున్నారు. చిన్నా, పెద్దా అనే తేడా లేదు. మరాఠా గడ్డపై పుట్టినోళ్లంతా.. ఇప్పుడు ఛావా సినిమాని ఓ పండగలా సెలబ్రేట్ చేసుకుంటున్నారు.నిజానికి.. దేవుడి సినిమాలు, దేశభక్తికి సంబంధించిన సినిమాలు రిలీజైనప్పుడు.. ఇలాంటి సీన్లు థియేటర్లలో కనిపిస్తూ ఉంటాయ్. తెలుగులో అన్నమయ్య, శ్రీరామదాసులాంటి సినిమాలు వచ్చినప్పుడు.. అంతా థియేటర్లకు క్యూ కట్టారు. దేవుళ్లకు, సినిమా పోస్టర్లకు పూజలు చేశారు. ఆ మధ్య వచ్చిన.. ఉరి సినిమాకు కూడా ఇలాంటి రెస్పాన్సే కనిపించింది. హౌ ఈజ్ ద జోష్ అనే స్లోగన్.. ఇండియా మొత్తం రీసౌండ్‌లో వినిపించింది. కానీ.. ఓ పీరియాడికల్ డ్రామాకు.. జనం నుంచి ఇంత స్పందన, ఈ రకమైన ఎమోషనల్ రియాక్షన్ వస్తుందని ఎవరూ ఊహించలేదు. కానీ.. ఇప్పుడదే జరుగుతోంది. చరిత్ర సృష్టించి.. చరిత్రలో గొప్పగా నిలిచిపోయిన ఛత్రపతి శంభాజీ మహరాజ్ గురించి.. ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చ నడుస్తోంది.సినిమా.. చాలా మందికి ఎమోషనల్‌గా కనెక్ట్ అయింది. మూవీ టాక్ విన్నాక.. థియేటర్లలో ఆడియెన్స్ ఎమోషనల్ రియాక్షన్స్ చూశాక.. అంతా తీరిక చేసుకొని మరీ.. సినిమాకు వెళ్తున్నారు. కనెక్ట్ అవుతున్నారు. అక్కడే ఏడ్చేస్తున్నారు. ఛత్రపతి శంభాజీ మహరాజ్ చరిత్రని తెరపై చూస్తూ.. పండగ చేసుకుంటున్నారు.ఛత్రపతి శంభాజీ మహరాజ్ పాత్రలో విక్కీ కౌశల్ నటన చూశాక.. ప్రతి ఒక్కరూ ఆ పాత్రతో కనెక్ట్ అవుతున్నారు. థియేటర్‌కు వచ్చిన ప్రేక్షకులు.. క్లైమాక్స్‌లో భావోద్వేగానికి గురవుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. శంభాజీ పాత్రలో విక్కీ కౌశల్ యాక్టింగ్ చూసివాళ్లంతా.. శభాష్ అంటున్నారు. ఊహించని విధంగా బ్లాక్ బస్టర్ అయిన ఈ సినిమాని.. అభిమానులు, మరాఠా ప్రజలు సెలబ్రేట్ చేసుకుంటున్న తీరు అందరినీ ఆకర్షిస్తోంది. సినిమా పూర్తవగానే.. ఏకంగా గుర్రంపై శంభాజీ వేషధారణలో సినిమా హాల్లోకి వచ్చేశాడు ఓ అభిమాని. ఇది చూసిన వారంతా.. జై శంభాజీ మహరాజ్ అంటూ నినాదాలు చేయడం వైరల్‌గా మారింది.చిన్నా, పెద్దా అనే తేడా లేదు. ఛావాను ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేస్తున్నారు. సినిమా చూసి చిన్నారులు చేస్తున్న నినాదాలు అందరినీ భావోద్వేగానికి గురిచేస్తున్నాయి. శంభాజీ మహారాజ్‌కు జై, జై భవానీ.. నినాదాలతో థియేటర్లు దద్దరిల్లిపోతున్నాయి. ఇలాంటి వీడియోలు షేర్ చేస్తూ.. ఇది తాము సొంతం చేసుకున్న నిజమైన గౌరవం అంటూ ఛావా మూవీ టీమ్ చెబుతోంది. సినిమా చూసిన చాలా మంది.. థియేటర్ల నుంచి కన్నీళ్లతో బయటకొస్తున్నారు. ఛత్రపతి శివాజీ వారసుడి పరాక్రమాన్ని, వీరత్వాన్ని గుర్తుచేసుకుంటున్నారు.దక్కన్ కా శివ! మరాఠాల ఛత్రపతి.. శివాజీ మహారాజ్! కాలగమనంలో.. సింహం పడిపోయి ఉండొచ్చు. కానీ.. అప్పటికి సింహం పిల్ల బతికే ఉంది. అతడే.. ఛత్రపతి శంభాజీ మహారాజ్. మరాఠాల.. ఛావా! ఛత్రపతి శివాజీ పెద్దకొడుకుగా.. ఆయన మరణానంతరం ఆయన వారసుడిగా మరాఠా రాజ్యాన్ని పాలించాడు శంభాజీ. తండ్రికి ఏమాత్రం తగ్గకుండా.. తాను ఉన్నంత వరకు మొఘులుల గుండెల్లో భయం అనే టైమ్ బాంబుని పెట్టిన మొనగాడు ఛావా! అతను.. మరాఠాల ఆత్మగౌరవమే కాదు.. హిందుత్వ అస్థిత్వం కూడా! అందుకే.. ఛావా ఇంతలా జనానికి కనెక్ట్ అయింది.లక్షల మంది సైన్యంతో మొఘలులు చేసిన దండయాత్రల్ని.. వీరోచితంగా తిప్పికొట్టాడు శంభాజీ. శంభాజీ ధాటికి తట్టుకోలేక.. ఔరంగజేబు.. 27 ఏళ్ల పాటు ఉత్తర భారతంలోకి అడుగుపెట్టలేకపోయాడు. కొద్దికాలంలోనే.. శంభాజీ మెరుపు వీరుడిలా విజృంభించాడు. కొంకణ్ తీరంలో బలవంతపు మత మార్పిళ్లతో హిందువుల్ని హింసిస్తున్న వాళ్లని.. తరిమికొట్టాడు. శంభాజీ పోరాటం వల్లే.. హిందూ ధర్మ రాజ్యం వేళ్లూనుకొని పటిష్టంగా నిలిచింది. అఖండ భారతమంతటికీ విస్తరించింది.శివాజీ అస్తమయం తర్వాత.. ఔరంగజేబు హిందూ ధర్మ రాజ్యాన్ని నాశనం చేసేందుకు కక్షకట్టాడు. తన సమస్త బలగాలని, యుద్ధాలను మరాఠాల మీదే కేంద్రీకరించాడు. అప్పుడు వెన్ను చూపకుండా.. శంభాజీ మహరాజ్ ధర్మపోరాటాలు కొనసాగించాడు.

# పాలమూరుపై పంతాల్

మహబూబ్ నగర్, ఫిబ్రవరి 22, పాలమూరు జిల్లా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్ అయ్యారు. పాలమూరు ప్రగతిపై పచ్చి అబద్ధాలు చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా జలాలను ఏపీ యథేచ్ఛగా తరలించుకపోతుంటే ఆపడం చేతగాక? బీఆర్ఎస్ మీద రంకెలేయడమేంటని ప్రశ్నించారు.టీడీపీ, కాంగ్రెస్ పాలమూరుకు తీరని ద్రోహం చేసింది రేవంత్ రెడ్డి. ఇదిచరిత్ర చెపుతున్న సత్యం. పాలమూరును దత్తత తీసుకున్న అని చెబుతూనే పడావు పెట్టిండు నీ గురువు చంద్రబాబు. పాలమూరు ప్రాజెక్టులను పెండింగ్ ప్రాజెక్టులుగా మార్చి? పాలమూరు ప్రజల బతుకుల్లో నిప్పులు పోసింది కాంగ్రెస్. పాలమూరును ఎండబెట్టిన పాపం కాంగ్రెస్, టీడీపీలదే. ఆ 2 పార్టీల్లో ఉన్న రేవంత్ రెడ్డికి ఆ రెండు పాపాల్లో వాటా ఉంది. నువ్వు వక్రీకరించినంత మాత్రాన చరిత్ర మారుతుందా?? నీ వక్రబుద్ధి ప్రజలకు తెలియకుండా పోతుందా..?" అని హరీశ్ రావు ప్రశ్నించారు."పోతిరెడ్డిపాడు నీళ్లు తరలిస్తుంటే హారతులు ఇచ్చి.. వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఊడిగం చేసింది కాంగ్రెస్ నేతలే. అలాంటి చరిత్ర మరిచి రేవంత్ మాట్లాడటం గురివింద సామెతను గుర్తు చేస్తోంది. చంద్రబాబుకు ఊడిగం చేసినా మోదీకి భయపడి బడే భాయ్ అన్నా అది రేవంత్ రెడ్డికే సాధ్యం. రేవంత్‌కు నీటి విలువ తెలియదు. నోటి విలువ తెలియదు. తెలిసింది ఒక్క అవినీతి నోట్ల విలువ మాత్రమే. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతలకు అడ్డుపడుతూ కేసులు వేయించిన వ్యక్తివి నువ్వే" అని హరీశ్ రావు విమర్శలు గుప్పించారు.కాంగ్రెస్ అధికారంలోకి రాకుంటే పాలమూరు ఎత్తిపోతల పూర్తి చేసి నారాయణపేట కొడంగల్ రైతుల కాళ్లు కడిగేవాళ్లమని హరీశ్ రావు అన్నారు. వలసలకు, ఆకలి చావులకు నిలయంగా మారిన పాలమూరు తలరాతను మార్చింది కేసీఆర్ అని స్పష్టం చేశారు. పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చారని గుర్తు చేశారు."పదేళ్ల బీఆర్ఎస్ పరిపాలనలో దాదాపు 12 లక్షల ఎకరాల ఆయకట్టుకు పాలమూరులో నీళ్లు అందించిన ఘనత మాది. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పూర్తికాగానే మరో ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఒక్క ఎకరానికి నీళ్లు ఇవ్వని నువ్వు కేసీఆర్ మీద రంకెలేస్తావా..? సూర్యుడి మీద ఉమ్మేసినట్టే. 14 నెలల్లో ఒక్క చెక్ డాం కూడా కట్టని ముఖ్యమంత్రివి నువ్వు కేసీఆర్ గురించి మాట్లాడుతావా..? నీ 14 నెలల పాలన మీద చర్చకు నేను సిద్ధం. నీ సవాలును స్వీకరిస్తున్నా. ఏ రోజు చర్చ చేద్దాము, ఎక్కడ చర్చ చేద్దామో నువ్వే చెప్పు. నువ్వు చెప్పిన చోటికి, చెప్పిన సమయానికి వస్తా. నీ కొడంగల్ నియోజకవర్గమైన సరే, చివరకు నీ ఇంట్లో అయినా సరే తప్పకుండా వస్తా" అంటూ హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు.నారాయణపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. గత పాలకులు పాలమూరు జిల్లాను పట్టించుకోలేదని విమర్శించారు. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు.కాంగ్రెస్ పాలన సరిగా లేదని విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. "10 ఏళ్లు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారు.. 12 ఏళ్ల నుంచి మోడీ ప్రధానిగా ఉన్నారు. 12 నెలలుగా కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అధికారంలో ఉంది. ప్రతిపక్ష నేతగా కేసీఆర్, కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి చర్చకు వస్తే సీఎం నేను సిద్ధం. గత పదేళ్ల పాలనపై చర్చిద్దాం" అంటూ సవాల్ విసిరారు.

# హైడ్రాకు మరిన్ని పవర్ పోలీస్ స్టేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 22హైడ్రా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. హైడ్రా పేరు వింటేనే అక్రమదారులు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే హైడ్రాకు ప్రభుత్వం రోజురోజుకీ మరింత బలాన్ని చేకూరుస్తోంది. ఆర్థికంగా ప్రభుత్వం ఫుల్ సపోర్టు చేస్తోంది. గతంలో హైడ్రాకు పోలీస్ స్టేషన్ కూడా అందుబాటులోకి రానుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. పోలీస్ స్టేషన్ ఏర్పాటు అయ్యాక హైడ్రాకు మరింత బలం చేకూరనుంది.మార్చి మొదటి వారంలో హైడ్రా పోలీస్ స్టేషన్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే హైడ్రా పోలీస్ స్టేషన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన అన్ని రకాల పనులు ఫిబ్రవరి చివరి వారంలోగా పూర్తి చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. దీంతో పోలీస్ స్టేషన్ లో కావాల్సిన సిబ్బంది గురించి కమిషనర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. కావాల్సిన సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.హైడ్రాకు ఒక పోలీస్ స్టేషనే కాక వెబ్ సైట్, మొబైల్ యాప్ కూడా అందుబాటులోకి రానున్నాయి. హైడ్రాకు సంబంధించిన వెబ్ సైట్ , మొబైల్ యాప్ కూడా రూపొందించేందుకు ఇప్పటికే అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే వీటికి సంబంధించిన పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి. మొబైల్ యాప్ లో చెరువులు, కుంటలు, ఎఫ్టీఎల్, బఫర్ జోన్ ల వివరాలను తెలియజేయనున్నారు. దీంతో భాగ్యనగర వాసులకు ఎలాంటి స్థలం కొనాలో ఈజీగా తెలుసుకోవచ్చు. ఎక్కడ ల్యాండ్ కొనకూడదో తెలుసుకోవచ్చు. హైడ్రా పోలీస్ స్టేషన్, వెబ్ సైట్, యాప్ సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించాలని నిర్ణయించారు. మార్చి ఫస్ట్ వీక్ లో ఈ మూడు అందుబాటులోకి రానున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు.హైడ్రా ప్రధాన కార్యాలయానికి పైగా ప్యాలెస్‌ను కేటాయించిన విషయం అందరికీ తెలిసిందే. ఈ భవంతికి సంబంధించిన మరమ్మతులను హెచ్ఎండీఏ చేపడుతోంది. పైగా ప్యాలెస్ భవనానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చింది. అయితే, ఈ మరమ్మతుల పనులు అన్నీ పూర్తి కావడానికి సంవత్సర కాలం పట్టే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. అలాగే రీజనల్ అఫీసులను కూడా ఏర్పాటు చేయనున్నారు.భాగ్యనగరానికి సంబంధించిన రీజినల్ కార్యాలయాన్ని బుద్ధ భవన్ లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాచకొండకు సంబంధించిన రీజినల్ కార్యాలయాన్ని తార్నాకలోని పాత హెచ్ఎండీఏ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్నారు. సైబరాబాద్ కు సంబంధించిన రీజనల్ కార్యాలయాన్ని నానక్ రాం గూడలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్(ఊఉఅఎ)లో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే వీటి పనులు ప్రారంభమయ్యాయి.

ఈ విధంగా రీజనల్ కార్యాలయాలు:

హైదరాబాద్ ? బుద్ధభవన్

రాచకొండ– తార్నాక ఓల్డ్ హెచ్ఎండీఏ ఆఫీస్

సైబరాబాద్ ? నానాక్ రాం గూడ (హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్)

# బతికిన బతుకమ్మ కుంట



హైదరాబాద్, ఫిబ్రవరి 22గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చెరువులు కుంటల సంరక్షణ పునరుద్ధరణలో.. హైడ్రా మరో విజయం సాధించింది. బఫర్ జోన్లలో నాళాలపైన అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంతో పాటు చెరువులను పునరుద్ధరించే పనులు నిర్వహిస్తున్న హైడ్రా.. అంబర్ పేట్ బతుకమ్మ కుంటలో తవ్వకాలు చేపట్టింది. మోకాల లోతు తవ్వగానే బతుకమ్మ కుంటలో నీళ్లు వచ్చాయి. దీంతో బతుకమ్మకుంట బ్రతికే ఉందంటూ స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.రేవంత్ సర్కారు ఏర్పాటు చేసిన హైడ్రా పుణ్యమా అంటూ అంబర్ పేట్‌లోని బతుకమ్మకుంట బయటపడింది. కబ్జా చెర వీడడంతో దీని అభివృద్ధి పైన హైడ్రా దృష్టి పెట్టింది. ఇళ్లను కూల్చకుండా కుంటపైనే దృష్టిపెట్టింది. ఆ తర్వాత చెత్త, మొక్కల్ని తొలగించిన అధికారులు తాజాగా చెరువులో పూడిక తీయడం స్టార్ట్ చేశారు. బుధవారం జేసీబీలు కేవలం అడుగున్నర తవ్వగా లోపల నుంచి వాటర్ ఉబికి వచ్చాయి. ఈ దృశ్యాన్ని చూస్తున్న స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ.. కుంట అభివృద్ధిలో తమ వంతు సహకారాన్ని అందించడానికి ముందుకు వచ్చారుబడాబాబుల కబ్జాలకు గురై కుంట ఎండిపోయి జీవం పోయిందనుకున్న బతుకమ్మ కుంట బ్రతికే ఉందని తెలిసి స్థానికులు చేరుకుంటున్నారు. ఆ కుంటలో మోకాళ్ల లోతు మట్టి తీయగానే బిరబిర గంగమ్మ బయటకు వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. అయితే ఇటీవల కొందరు ఇది బతుకమ్మకుంట కాదు.. మా స్థలమని నమ్మబలికిన వారు ఇప్పుడేమంటారు అక్కడి స్థానికులు ప్రశ్నిస్తున్నారు.కాగా హైదరాబాద్‌ను మహా నగరంగా తీర్చిదిద్దేందుకు హైడ్రా చర్యలు చేపడుతుంది. నగరంలో ట్రాఫిక్ సమస్యలను తీర్చిదిద్దేందుకు చర్యలు చేసేందుకు కృషి చేస్తున్నారు. దాని కోసం జీహెచ్ఎంసీ హెచ్–సిటీ ప్రాజెక్టు పేరులో ఫ్లై ఓవర్లు, జంక్షన్ల అభివృద్ధి, అండర్‌పాస్‌ల నిర్మాణాలకు రూ.5,942 కోట్ల విలువైన 38 పనులకు ప్రభుత్వం పాలనా పరమైన అనుమతులు ఇచ్చింది. ఇక ఫోర్త్ సిటీ లక్ష్యం, నగరం నలుమూలలా మెట్రో విస్తరణ, అంతర్జాతీయ సంస్థలకు హైదరబాద్ ఫస్ట్ ఛాయిస్‌గా ఎదుగుతుండడంతో కొత్త టెక్నాలజీ రంగాలకు హబ్‌గా హైదరాబాద్‌ను నిలిపేందుకు, ఏఐ, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారు.రాబోయే రోజుల్లో హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున ఆధునిక సదుపాయాల వృద్ధికి.. ప్రభుత్వం నడుంబిగించడమే కాకుండా నగరాన్ని సస్టైనబుల్ సిటీగా తీర్చిదిద్దడమే హైడ్రా లక్ష్యమని ప్రభుత్వం చెబుతుంది. ఇందులో భాగంగా బతుకమ్మ కుంటలో కొన్ని అడుగుల తవ్వకాలకే నీళ్లు ఉబికిరావడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. హైడ్రా చర్యల వల్లే బతుకమ్మకుంటకు పునరుజ్జీవం దక్కిందని కాంగ్రెస్ నేతలు కుంట వద్ద సంబరాలు చేసుకుంటున్నారు.ఏర్పాటైన అతి తక్కువ కాలంలోనే ఔటర్ రింగ్ రోడ్డు వరకు తన పరిధిని పెంచుకొని చెరువులు, కుంటలు, నాళాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యతలను హైడ్రా చేపట్టింది. కాగా అతి త్వరలోనే హైడ్రా మొదటి పోలీసు స్టేషన్ కూడా ఏర్పాటు కానుంది. ఈ నేపథ్యంలో రాబోయే హైడ్రా చర్యలపై ఆసక్తి నెలకొంది.

## యాదాద్రిలో కొనసాగుతున్న మహా కుంభాభిషేకం

యాదాద్రి,యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి స్వర్ణ విమాన రాజగోపురం మహా కుంభాభిషేకం మూడో రోజు పూజలు నిర్వహించడం జరిగింది యాగశాలలో స్వామివారి అమ్మవారి ఉత్సవ మూర్తులను ప్రతిష్టించి యజ్ఞాతి హోమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రుత్వికులను ఆహ్వానించడం జరిగింది. 23వ తేదీన ఉదయం 10:30 నుండి మహా కుంభాభిషేకం నిర్వహించడం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు.

# మళ్లా తెలంగాణ సెంటిమెంట్...

హైదరాబాద్, ఫిబ్రవరి 22 రాజకీయాల్లో నేతల ప్రతీ మాటకు ఓ లెక్క ఉంటుంది. కొద్ది మంది తమ మాటల ద్వారా ప్రజల్ని తమ వైపు తిప్పుకుంటారు. మరి కొద్ది మంది నేతలు తమ మాటల ద్వారా ప్రత్యర్థి నేతలను, పార్టీలను ఢిఫెన్స్‌లోకి నెడతారు. మరి కొద్ది మంది నేతలు మాట జారి వివాదస్పదమై సెల్ఫ్ డిఫెన్స్‌లోకి జారుకుంటారు. అలాంటి వ్యాఖ్యలతో పార్టీకి, ప్రజలకు ఓ సంకేతాన్ని పంపుతారు ఇంకొందరు. ఇదంతా ఎందుకంటే రాజకీయ నేతలకు ప్రధాన ఆయుధం వారి మాటలే. బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు చర్చాంశనీయమయ్యాయి. ఏపీ సీఎం చంద్రబాబు తెలంగాణలో పాగా వేసేందుకు ప్రయత్నిస్తున్నారు అని కేసీఆర్ వాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు కాకతాళీయంగా చేసినవి కాదన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. చాలా ఆచితూచి ప్రయోగించిన పాత అస్త్రంగా కేసీఆర్ రాజకీయాలన్ని దగ్గరి నుంచి చూస్తోన్న విశ్లేషకులు చెబుతున్నారు. విస్తృత స్థాయి సమావేశంలో కేసీఆర్ చంద్రబాబు పాలన నాటి రోజులను గుర్తు చేశారు. కరెంటు కోతలు, కరెంటు ఛార్జీల పెంపు, ఉద్యమం నాటి పరిస్థితులను చెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే తాను తెలంగాణ ఉద్యమాన్ని ఎత్తుకోవాల్సి వచ్చింది, కనీసం తన పార్టీకి కార్యాలయం దొరకనీయకుండా చంద్రబాబు చేశారని గుర్తు చేశారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జల దృశ్యంలో తన ఇంటినే కార్యాలయంగా ఇస్తే దాన్ని చంద్రబాబు కూల్చివేశారని చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యల ద్వారా తెలంగాణ ప్రాంతానికి చంద్రబాబు ప్రధాన శత్రువు అని చెప్పే ప్రయత్నం చేశారు కేసీఆర్. చంద్రబాబు అడుగుపెడితే అవే పరిస్థితులు పునరావృతం అవుతాయని హెచ్చరికను పార్టీ శ్రేణులకు, ప్రజలకు పంపే ప్రయత్నం చేశారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత జరిగిన తొలి శాసన సభ ఎన్నికల్లోను కేసీఆర్ ప్రధాన ప్రచారాస్త్రం చంద్రబాబే. తెలంగాణను అడ్డుకున్న వ్యక్తిగా చంద్రబాబును ఆ ఎన్నికల్లో కేసీఆర్ చిత్రీకరించారు. తెలంగాణను అడ్డుకునేందుకు టీడీపీ ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించిన చంద్రబాబు తిరిగి తెలంగాణ రాజకీయాల్లోకి ఎలా రానిద్దామంటూ ప్రతీ సభలో కేసీఆర్ ప్రజలను ప్రశ్నించారు. ఈ ప్రచారం ప్రజల్లోనీ తీవ్ర చర్చ రెకెత్తించింది. కేసీఆర్ ఎత్తుగడ ఫలించింది. ఆ ఎన్నికల్లో గులాబీ పార్టీ మెజార్టీ స్థానాలు గెల్చుకోని అధికారంలోకి వచ్చింది.2018లో కూడా చంద్రబాబును టార్గెట్ చేస్తూ ప్రచారం చేశారు. ఆయన టార్గెట్‌గానే కేసీఆర్ ప్రతి సభలో విమర్శలు చేశారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని తెలంగాణపై పెత్తనం చేయడానికి వస్తున్నారని తీవ్ర స్థాయిలో సెంటిమెంట్ రగిల్చారు. అప్పుడు కూడా చంద్రాస్త్రంతోనే కేసీఆర్ పవర్‌లోకి వచ్చారు. అధికారం కోల్పోయి ఏడాదిన్నర అవుతున్న టైంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం వేదికగా కేసీఆర్ చంద్రబాబు అస్త్రాన్ని బయటకు తీశారు. తిరిగి ఎన్డీఏ పేరుతో చంద్రబాబు తెలంగాణలో రాజకీయాలు చేయనున్నారని ఇది తెలంగాణ ప్రాంతానికి నష్టం చేస్తోందని చెప్పేందుకు కేసీఆర్ విమర్శలు చేశారు. ఓవైపు చంద్రబాబు ఏపీ సీఎంగా ఉంటూ, తెలంగాణలో రాజకీయాల్లో కూడా అడుగుపెడితే తెలంగాణాకు అన్యాయం, ఏపీకి లాభం జరుగుతుందన్న లాజిక్‌ను వాడే ప్రయత్నం చేస్తున్నారు కేసీఆర్.ఎన్డీఏలో చక్రం తిప్పే పరిస్థితుల్లో ఉన్న చంద్రబాబు, తెలంగాణలోకి రానిస్తే కేంద్రం నుంచి వచ్చేవి రాకుండా అడ్డుపడే అవకాశం ఉంటుందని, గోదావరి, కృష్ణా జలాలను తరలించుకునే అవకాశం ఉందని అందుకే కేసీఆర్ ఈ వాఖ్యలు చేసినట్లు గులాబీ ముఖ్య నేతలు చెబుతున్నారు. చంద్రబాబు శిష్యుడైన రేవంత్ రెడ్డి ఇక్కడ సీఎంగా ఉండటంతో చంద్రబాబుకు అడ్డు లేకుండా పోతుందని అందుకే కేసీఆర్ ముందు చూపుతో చేసిన వ్యాఖ్యలగా బీఆర్ఎస్ నేతలు విశ్లేషిస్తున్నారు. ఎన్డీఏ పేరుతో తెలంగాణలోకి చంద్రబాబు రాకుండా చేసే ప్రచారం కేసీఆర్ చేపట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రచారంతో తెలంగాణ ప్రజల్లో మరోసారి సెంటిమెంట్ రేకెత్తించవచ్చన్నది ఆయన వ్యూహంగా రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2014, 2018లో మెజార్టీ స్థానాలు బీఆర్ఎస్ గెలవడానికి కారణం తెలంగాణలో చంద్రబాబు ప్రచారం చేయడమే అన్న విశ్లేషణలు ఉన్నాయి. మళ్లీ ఇప్పుడు చంద్రబాబు తెలంగాణలో తిరిగితే అది కేసీఆర్‌కు ప్లస్ అవుతుందని రాజకీయ పరిశీలకుల అభిప్రాయం. ఇదే జరిగితే మళ్లీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అది కేసీఆర్‌కు సెంటిమెంట్ అస్త్రంగా మారనుందని అంటున్నారు. ఇదే వ్యూహంతో కేసీఆర్ చాలా ఆలోచించే ఈ వ్యాఖ్యలు చేసినట్లు చెబుతున్నారు.

## జిల్లాలో యథేచ్ఛగా ఇసుక దోపిడీ

నిజామాబాద్,జిల్లాలో యాదేశచ్ఛగా ఇసుకు అక్రమ రవాణాకు గురవుతోంది. అనుమతుల పేరిట అక్రమ రవాణా సాగుతోంది. ఏరుగట్ల మండలం బట్టాపూర్ వద్ద పెద్ద వాగులో ఇసుక జాతర జరుగుతోంది.

నిబంధనలకు విరుద్ధంగా జేసిబిల తో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. సీఎం రేవంత్ ఆదేశాలు భే ఖాతర్ అయ్యాయి. 30 వే బిల్లులతో 3 వందల ట్రాక్టర్ల ఇసుక తరలింపు జరిగినట్లు సమాచారం.

# ఎల్ ఆర్ ఎస్ పై రూల్స్...కండిషన్స్ అప్లై

హైదరాబాద్, ఫిబ్రవరి 22, ఎల్ఆర్ఎస్ (లే అవుట్ల క్రమబద్ధీకరణ) దరఖాస్తులను పరిష్కరించే దిశగా తెలంగాణ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. స్కీమ్ అమలులో వేగం పెంచేందుకు 25 శాతం రాయితీని ప్రకటించింది. 2020లో తీసుకువచ్చిన రూల్స్ కి కొన్ని సవరణలు చేసింది.అవుట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇటీవలనే కీలక నిర్ణయం తీసుకోగా.. తాజాగా ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు కూడా జారీ చేసింది. క్రమబద్ధీకరణ ఫీజులో 25 శాతం రాయితీ ఇవ్వనుంది. అయితే మార్చి 31లోగా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజును చెల్లించిన వారికి మాత్రమే ఈ రాయితీ నిర్ణయం వరిస్తుంది. ఇదే విషయాన్ని ఉత్తర్వుల్లో కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. గతంలో ఉన్న నిబంధనల్లో పలు మార్పులు తీసుకువచ్చింది.స్కీమ్ లో తీసుకువచ్చిన తాజా మార్పులతో చాలా మంది భూయాజమానులు తమ స్థలాలను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉంది. దీని ద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీగానే ఆదాయం రానుంది. అయితే ఈ స్కీమ్ లో తాజాగా తీసుకువచ్చిన మార్పులు, కటాఫ్ తేదీ వివరాలకు సంబంధించిన ముఖ్యమైన విషయాలు ఇక్కడ చూడండి?.ఎల్ఆర్ఎఎస్ స్కీమ్ - 10 ముఖ్యమైన అంశాలు:ఎల్ఆర్ఎస్ స్కీమ్ 2020 ఏడాదిలో తీసుకొచ్చారు. ఇందుకోసం గ్రామాలు, పట్టణాల్లో భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఈ స్కీమ్ లో భాగంగా?అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించారు.దరఖాస్తు ఫీజు కింద రూ. 1000 నిర్ణయించారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ప్రభుత్వానికి 25.67 లక్షల దరఖాస్తులు అందాయి. ఇందులో ప్లాట్లకు సంబంధించినవి 25.53 లక్షల దరఖాస్తులు కాగా, లేఅవుట్ల దరఖాస్తులు 0.13 లక్షలుగా ఉన్నాయి. ఇవన్నీ కూడా పెండింగ్ లో ఉన్నాయి.ఎల్ఆర్ఎస్ స్కీమ్ విషయంలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. దీంతో నాటి ప్రభుత్వం ముందుకు వెళ్లలేకపోయింది. దీంతో అప్పట్నుంచి? నేటి వరకు కూడా ఈ దరఖాస్తుల విషయం పెండింగ్ లోనే ఉండిపోయింది. దరఖాస్తుదారులంతా క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్నారు.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం?. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ఫోకస్ పెట్టింది. జిల్లాల వారీగా ప్రత్యేక డెస్క్ లను ఏర్పాటు చేసి? పరిష్కారం చేసే దిశగా ప్రయత్నాలు చేసింది. అయితే అనుకున్న స్థాయిలో స్పందన రాలేదు.ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 10 శాతం ప్లాట్లు రిజిస్టరైన లేఅవుట్లలో మిగిలిన ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. మార్చి 31 లోపు క్రమబద్ధీకరణ ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ ఇస్తామని మంత్రుల బృందం ప్రకటిచింది.మంత్రుల బృందం ప్రకటన తర్వాత తాజాగా ఇందుకు సంబంధించి అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. 'తెలంగాణ రెగ్యులరైజేషన్ ఆఫ్ అన్అప్రూవ్డ్ అండ్ ఇల్లీగల్ లేఅవుట్ రూల్స్ 2020కి సవరణలు చేస్తూ జీవో నెంబర్ 28ని విడుదల చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులను జారీ చేశారు.ఈ జీవో వివరాల ప్రకారం? లే ఔట్ల క్రమబద్ధీకరణ ఫీజులో 25 శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 31లోగా ఫీజు చెల్లించిన వారికి ఈ రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేసింది.తాజా సవరణల ప్రకారం ఒఖీూ కటాఫ్ తేదీ (26.08.2020) నాటికి లేఔట్లలో కనీసమైనా 10 శాతం ప్లాట్లు విక్రయించి ఉండాలి. దీంతో మిగతా విక్రయించని ప్లాట్లను ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలు ఉంటుంది.ఈ లేఔట్లలో భూమిని కొనుగోలు చేసినవారు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ కు వెళ్లి వివరాలను సమర్పించవచ్చు. వీటిని ఎల్ఆర్ఎస్ పోర్టల్ కు అనుసంధానం చేస్తారు. ఇక్కడ క్రమబద్ధీకరణ చార్జీలతో పాటు ప్రోరేటా ఓపెన్ స్పేస్ చార్జీలు వసూలు చేసి రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు.

# ఐదేళ్ల తర్వాత సేమ్ సీన్....

## నీటి దొంగలు అంటూ ఆరోపణలు

హైదరాబాద్, ఫిబ్రవరి 22, తెలంగాణలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆంధ్రప్రదేశ్ లో ఐదేళ్ల పాటు జగన్ సీఎంగా ఉన్నారు. అప్పుడు కాంగ్రెస్ ఇద్దరు కుమ్మక్కయ్యారని, జగన్ తో లాలూచీపడి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టారని ఆరోపించింది. ఇప్పుడు ముఖ్యమంత్రులు మారినా అదే విమర్శ మళ్లీ వినపడుతుంది. ఈసారి తెలంగాణలో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉండగా, ఏపీలో చంద్రబాబు సీఎంగా ఉన్నారు. కృష్ణానది నీటిని ఏపీ తరలించుకుపోతున్నా పట్టించుకోవడం లేదని అప్పుడూ..ఇప్పుడూ ఆరోపణలు ఒక్కటే. దీనికి ముఖ్యమైన కారణం ఇద్దరి ముఖ్యమంత్రుల మధ్య ఉన్న సాన్నిహిత్యమే కారణమని చెప్పకతపపదు. అదే విపక్షాలకు వరంగా మారిందని చెప్పాలి. ఎందుకంటే కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏపీలో జగన్ సీఎంగా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వెళ్లి వచ్చారు. తర్వాత ఇద్దరి మధ్య బంధం బలపడింది. జగన్ కూడా ప్రగతి భవన్ కు వచ్చి కేసీఆర్ తో ముచ్చటించారు. కేటీఆర్ కూడా జగన్ సీఎం కాక ముందు ఆయన నివాసానికి వెళ్లి మాట్లాడి వచ్చారు. ఇలా ఈ ఇద్దరి మధ్య సఖ్యత అనేది బాగా ఉందని అందరికీ తెలిసిందే. బహిరంగ రహస్యమే. అయితే రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య సఖ్యత ఉండటాన్ని ఎవరూ తప్పుపట్టడానికి వీలులేదు. కానీ దానిని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటూ విపక్షాలు ఎదిగేందుకు చేస్తున్న ప్రయత్నమే ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. మొన్నటి ఎన్నికల్లోనూ జగన్ గెలుస్తారని కేసీఆర్ వ్యాఖ్యానించారురేవంత్, చంద్రబాబు... ఇక 2023 ఎన్నికల్లో తెలంగాణ లో కాంగ్రెస్ రాగా, 2024 ఎన్నికల్లో ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చింది. రెండు ప్రభుత్వాలకు సారూప్యత లేదు. అయితే ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన వారే కావడంతో పాటు ఆయన రాజకీయ గురువు అని భావించే చంద్రబాబుతో లాలూచీ పడి రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టుపెడుతున్నారని ప్రస్తుత బీఆర్ఎస్ ఆరోపిస్తుంది. కొంతకాలం క్రితం చంద్రబాబు కూడా వచ్చి రేవంత్ రెడ్డితో సమావేశమై రాష్ట్ర విభజన సమస్యలపై చర్చించి వెళ్లారు. అయితే ఇద్దరి పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరి రాష్ట్రం వారికి కావాలి. జగన్ కోసం కేసీఆర్, చంద్రబాబు కోసం రేవంత్ లు రాష్ట్రాన్ని పణంగా పెట్టరు. ఎందుకంటే ఏమాత్రం నలుగురి లో ఏ ఒక్కరు రాష్ట్ర ప్రయోజనాలు పణంగా పెట్టినా ప్రజలు రాజకీయ సమాధి కట్టేస్తారని తెలయని నేతలు కాదు. కృష్ణా నదిని తరలించుకుపోతుంటే కేసీఆర్ చూస్తూ ఊరుకుండరు. అలాగే రేవంత్ రెడ్డి కూడా మౌనంగా ఉండరు. ఖచ్చితంగా పోరాడతారు. కేఆర్ఎంబీ ఒకటి ఉంది. అది నిర్ణయించిన మేరకే నీటి వాటాలుంటాయి తప్పించి ఎవరిష్టం వారు నీటిని తోడుకుపోయే అవకాశం ఉండదు. కానీ రాజకీయాలకు ఇవన్నీ అనవసరం. ఎవరు విపక్షంలో ఉన్నప్పటికీ ఈ ఆరోపణలను కట్టిపెట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలి. అయితే రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా ఎవరున్నా సఖ్యతగానే ఉంటూ ఇరురాష్ట్రాల రైతుల, ప్రజల కు సాగు,తాగునీరు అందించగలగాలి. అదే కదా? ఎవరైనా కోరుకునేది. అందుకే విపక్షాలు విమర్శలు మాని సహేతుకమైన సూచనలు చేస్తే బాగుంటుంది.

# అంతు పట్టని దళపతి వ్యూహం

## ఆత్మ స్తుతి, పరనింద



హైదరాబాద్, ఫిబ్రవరి 22, నెలల లాంగ్ రెస్ట్ తర్వాత గులాబీ బాస్ జనంలోకి వచ్చారు. పార్టీ ఆఫీస్ లో మీటింగ్ పెట్టారు. ఇంత చేసి భవిష్యత్ పై దిశానిర్దేశం చేస్తారని చాలా మంది గులాబీ లీడర్లు అనుకున్నారు. కానీ కేసీఆర్ మాత్రం తెలంగాణ ఉద్యమ చరిత్ర ? బీఆర్ఎస్ పాత్రపై గంటలు గంటలు మాట్లాడారు. మళ్లీ సెంటిమెంట్ రగిల్చి లాభపడే ఉద్దేశమే తప్ప.. భవిష్యత్ లో ఏం చేద్దాం.. ఎలా ముందుకెళ్దాం అన్న పాయింట్లు లేకుండా పోయాయన్న వాదన వినిపిస్తోంది. ఆత్మ స్తుతి, పరనింద ఇదేనా గులాబీ బాస్ కొత్త సందేశం?మరోసారి తెలంగాణ ఉద్యమ చరిత్ర, అందులో కేసీఆర్ పాత్ర, సెంటిమెంట్ చుట్టూనే మ్యాటర్ మొత్తం తిప్పారు. పార్టీ నేతలతో మాట్లాడిన స్పీచ్ లో ఎక్కువ దానికే కేటాయించారు. ఎక్కడైనా చేసిన పని గెలిపిస్తుంది. నిలబెడుతుంది. ఇంకా ఎన్నాళ్లు సెంటిమెంట్ ను పట్టుకుంటారన్న విమర్శలను ప్రత్యర్థులు వినిపిస్తున్నారు. ఇంత చేసి గత పదేళ్లలో ఉద్యమకారులకు కేసీఆర్ ఏపాటి గౌరవం ఇచ్చారన్న ప్రశ్నలు వచ్చి పడుతున్నాయ్.రాకరాక జనంలోకి వచ్చి పార్టీని ఎలా జనంలోకి తీసుకెళ్లాలన్న విషయంపై దిశానిర్దేశం చేసుకోవాలి. కానీ విస్తృతస్థాయి మీటింగ్ లో అలా జరగలేదు. ఏదో అనుకుని ఇంకేదో చెప్పారా.. అన్న టాక్ ఇంటర్నల్ గా నడుస్తోంది. తమ పాలన భేష్, కాంగ్రెస్ పాలన బేకార్ అన్నట్లుగా మాట్లాడారు. అన్ని రంగాలు పడకేశాయన్నారు. అన్ని వర్గాల వారు రోడ్డున పడ్డారన్నారు. ప్రతిపక్ష నేతగా ఇవన్నీ రొటీన్ డైలాగ్సే. అయితే కొంత వరకైనా కనెక్ట్ అయ్యేలా ఉండాలి కదా అన్న పాయింట్ ను ప్రత్యర్థులు వినిపిస్తున్నారు.బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు ఏ పొజిషన్ లో ఉంది. అన్నది కేసీఆర్ చూసుకోవడం లేదా అన్న పాయింట్ కూడా చర్చకు వస్తోంది. నడిపించే నాయకుడు జనానికి దూరంగా.. ఉంటే నష్టం ఎవరికి అన్నది కూడా ఆలోచించడం లేదా అంటున్నారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి వచ్చి.. ప్రభుత్వం ఏవైనా తప్పులు చేస్తే నిలదీయడం, ఎండగట్టడం, సలహాలు ఇవ్వడం వంటివి కూడా చేయకపోతే ఎలా అన్న పాయింట్ కూడా తెరపైకి వస్తోంది. అంతెందుకు కులగణనలో పాల్గొనకుండా తిరిగి ఆ సర్వేపైనే విమర్శలు చేయడం.. ఇవన్నీ జనం అబ్జర్వ్ చేసే అంశాలే.అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం తర్వాత బీఆర్ఎస్ పార్టీ గ్రాఫ్ మరింతగా పడిపోయింది. తమకు తెలంగాణలో తిరుగే లేదు అనుకున్న గులాబీ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన సీట్లు సున్నా. ఇది ఎవరూ ఊహించలేదు. అయితే రాష్ట్రంలోనే ఓడారు.. ఇక ఎంపీ సీట్లు గెలిపించడం ఎందుకని జనం దూరం పెట్టేశారు. ఇప్పుడు ఏకంగా ఆదిలాబాద్-నిజామాబాద్-కరీంనగర్-మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి వరుసగా పోటీ పెట్టకపోవడం కూడా వేరే సిగ్నల్స్ ను పార్టీ శ్రేణుల్లోకి, జనంలోకి తీసుకెళ్తోందిఅంతెందుకు ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పరిధిలోనే కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవిత ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇలా సొంతంగా ప్రాతినిధ్యం వహించే చోట కూడా అభ్యర్థిని పెట్టి తమ స్టామినా ఏ పొజిషన్ లో ఉందో చూసుకోవాల్సిన టైంలో అస్త్ర సన్యాసం ఏంటన్న ప్రశ్నలకు కూడా తాజా మీటింగ్ లో జవాబు రాకుండా పోయింది. బీఆర్ఎస్ టిక్కెట్ వస్తుందని నమ్ముకున్న రవీందర్ సింగ్ లాంటి లీడర్లు.. ఇండిపెండెంట్ గా నామినేషన్లు వేసుకున్నారు. ఇదేనా గులాబీ బాస్ తమ లీడర్లు, క్యాడర్ కు ఇచ్చుకునే సందేశం?సో తిరిగి పుంజుకున్నాం.. జనంలోనే ఉన్నాం.. అని చెప్పుకోవాల్సిన పోటీలో దూరం ఉండడం గులాబీ పార్టీకి చాలా నష్టం చేసే అంశం. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఫాంహౌజ్ సీఎం అన్న ప్రచారం జరిగి అది ఓటమికి దారి తీసింది. ఇప్పుడు కూడా పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అధ్యక్షుడిగా ముందుండి నడపాల్సిన టైంలో ఏకంగా 7 నెలల గ్యాప్ తర్వాత ఫాంహౌజ్ నుంచి బయటకు వచ్చారు. ఇలా జరిగితే క్యాడర్ లో జోష్ పెరిగేదెలా.. లీడర్లలో ఉత్సాహం వచ్చేదెలా అన్నది గులాబీ పార్టీలో ఇంటర్నల్ గా జరుగుతున్న డిబేట్. పనిలో పనిగా కాంగ్రెస్ నేతలు కూడా కేసీఆర్ సీజనల్ పొలిటీషియన్ అంటూ, ఆయన ఫాంహౌజ్ లో పర్మినెంట్ గా రెస్ట్ తీసుకుంటేనే బెటర్ అని కౌంటర్లు కూడా ఇస్తున్నారు.అయిపోయిందనుకున్న పార్టీలు లేచాయి. లేచిన పార్టీలు పడిపోయిన సందర్భాలు చరిత్రలో ఉన్నాయి. అయితే తెలంగాణలో మాత్రం బీఆర్ఎస్ స్పేస్ ను బీజేపీ క్రమంగా ఆక్రమిస్తూ వస్తోంది. ఇది ఆ పార్టీకి అన్నిటికంటే పెద్ద సవాల్. అలాంటి విషయాలపై దిశానిర్దేశాలు లేకుండా పోవడమే పెద్ద మైనస్ అన్న టాక్ ఆ పార్టీలోనే వినిపిస్తోంది.కాంగ్రెస్, బీజేపీకి చెరో 8 ఎంపీ సీట్లున్నా నిధులు తేలేదన్నారు కేసీఆర్. మరి అదే అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ ఎన్నిసార్లు ఢిల్లీ వెళ్లి.. ఎన్నిసార్లు ప్రధానిని కలిశారన్న పాయింట్ వినిపిస్తోంది. అటు కృష్ణా జలాలను కాపాడుకోవడం తెలియట్లేదన్నారు. మరి బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సంగమేశ్వరం పనులు జరుగుతుంటే ఏం చేశారన్న ప్రశ్న తెరపైకి వస్తోంది. ఎమ్మెల్యేలు పార్టీ మారిన చోట్ల బైపోల్స్ రావడం ఖాయమే అంటున్నారు కేసీఆర్. బైపోల్స్ కు పోటీ చేసే ఉత్సాహం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో లేదా.. ధైర్యం చాలట్లేదా.. గతంలో బలం ఉన్నా ప్రత్యర్థి పార్టీల నుంచి ఎమ్మెల్యేలను ఎందుకు లాగేశారన్న ప్రశ్నలకు జవాబులు లేవు.పార్టీ పని అయిపోయిందని సొంత పార్టీ వాళ్లే ప్రచారం చేయడంతోనే పది మంది ఎమ్మెల్యేలు వెళ్లిపోయారని కేసీఆర్ మీటింగ్ లో అన్నారు. కానీ అక్కడ జరిగింది నిజంగా అదే ఫ్యాక్టరా.. అంటే కాదన్న జవాబు వస్తోంది. మరోవైపు కేసీఆర్ పవర్ లో ఉన్నప్పుడు కేంద్రంతో అంటీ ముట్టనట్లు ఉండడం, ప్రధాని మోడీ రాష్ట్రానికి వచ్చినా కనీసం వెళ్లి కలవకపోవడం, అలక పాన్పు ఎక్కడం, ఎడమొహం పెడమొహం అన్నట్లుగా డీల్ చేయడం ఇవన్నీ జరిగాయి. కేంద్రంతో గట్టిగా కొట్లాడలేదు.. అడగాల్సినవి అడగలేదు. ఫాలోఅప్ చేయాల్సినవి చేయలేదు.. మరి వచ్చేవి ఎలా వస్తాయన్న ప్రశ్నలకు జవాబు లేకుండా పోయింది.ఇంత చేసి తాజా విస్తృతస్థాయి మీటింగ్ లో గులాబీ బాస్ బీజేపీపై ఒక్క మాట కూడా మాట్లాడలేదంటున్నారు. ఇంతకు ముందు కూడా బీజేపీని పెద్దగా టార్గెట్ చేయడం లేదు. బీజేపీ ఇప్పుడు బీఆర్ఎస్ కు డేంజర్ గా మారింది. బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ బీజేపీకే వెళ్తోంది. పార్లమెంట్ ఎన్నికల్లోనే ఇది క్లారిఫై అయింది. అలాంటప్పుడు బీజేపీ విషయంలో సాఫ్ట్ గా ఉంటే ఇంకా సమస్యలు ఎదురవుతాయి. కానీ కేసీఆర్ మాత్రం బీజేపీని టార్గెట్ చేసే పరిస్థితిలో కూడా లేరంటున్నారు. అంతెందుకు ఉత్తర తెలంగాణ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ పెట్టకుండా బీజేపీకి పరోక్షంగా సపోర్ట్ ఇస్తున్నారన్నది కాంగ్రెస్ నేతల విమర్శ. ఇలా ఎన్ని కౌంటర్లు పడ్డా.., మాట మాత్రం మాట్లాడడం లేదు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో వరుస ఓటములతో పార్టీ లీడర్స్, క్యాడర్ అంతా నైరాశ్యంలో ఉండడంతోనే ఎమ్మెల్సీకి పోటీ పెట్టడం లేదని ఓవైపు గులాబీ లీడర్లు చెబుతుంటే.. ఉప ఎన్నికలకు రెడీ అవ్వాలని, స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదామని కేసీఆర్ ఎలా చెబుతారన్న ప్రశ్నలకు మాత్రం జవాబు ఇవ్వలేని పరిస్థితి.పరిస్థితి చూస్తుంటే.. పోటీ చేయకపోయినా పర్వాలేదు.. ఓడినా పర్వాలేదు.. కానీ అధికార పార్టీ మాత్రం గెలవొద్దు ఇప్పుడు గులాబీ నాయకత్వం ఇదే కాన్సెప్ట్ తో పని చేస్తోందా అన్న డౌట్లు కూడా వస్తున్నాయి. సో ఫైనల్ గా కేసీఆర్ రాజకీయ వ్యూహాలను తక్కువ అంచనా వేయడానికి లేదు. అలాగని సీరియస్ గా తీసుకోవాల్సిన పని కూడా లేదన్నది ప్రత్యర్థుల మాటే. ఎందుకంటే ఆ వ్యూహాలకు కాలం చెల్లిపోయిందంటున్నారు. ఎన్ని చేసినా కథ మారదని గుర్తు చేస్తున్నారు. అయినా ఆశ ఉంటుంది కదా.


# పద కవితా పితామహుడు, వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమయ్య

### -వేంకటేశ్వరస్వామి ని కీర్తిస్తూ 32వేలకు పైగా కీర్తనలు రచించిన అన్నమయ్య

### -నేడు ఆయన వర్ధంతి

( పెండ్యాల రామ్ కుమార్, )అన్నమయ్య లేదా తాళ్ళపాక అన్నమాచార్యులు వైశాఖమాసం విశాఖ నక్షత్రంలో ఒక శుభలగ్నంలో మూడు గ్రహాలు ఉన్నత దశలో వుండగా నారాయణసూరి, లక్కమాంబలకు నందకాంశమున పుత్రోదయమైనది, మగశిశువు గా ఉదయించాడు. సర్వధారి సంవత్సరం వైశాఖ శుద్ధ పూర్ణిమ నాడు (మే 9, 1408) కడప జిల్లా లోని రాజంపేట మండలం తాళ్ళపాక గ్రామములో అన్నమయ్య జన్మించాడు. 8వ యేట అన్నమయ్యకు ఆయన గురువు ఘనవిష్ణు దీక్షనొసగినపుడు అన్నమాచార్య నామం స్థిరపడింది. నారాయణసూరి ఆ శిశువునకు ఆగమోక్తంగా జాతకర్మ చేశాడు.

అన్నమాచార్య తెలుగు సాహితీ చరిత్రలో లభించిన ఆధారాల ప్రకారం మొదటి వాగ్గేయకారుడు (సాధారణ భాషలో గేయాలను కూర్చేవారు). అన్నమయ్యకు పదకవితా పితామహుడు అని బిరుదు ఉన్నది. దక్షిణాపథంలో భజన సాంప్రదాయానికి, పదకవితాశైలికి ఆద్యుడు. గొప్ప వైష్ణవ భక్తుడు. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ని, అహోబిలము లోని నరసింహ స్వామి ని, ఇతర వైష్ణవ సంప్రదాయ దేవతలను కీర్తిస్తూ 32వేలకు పైగా కీర్తనలు



రచించాడు . అన్నమయ్య పాటలు, పదాలు, పద్యాలలో భక్తి, సాహిత్యం, సంగీతం, శృంగారం, భావలాలిత్యం పెనవేసికొని ఉంటాయి.కన్నడ వాగ్గేయకారుడు పురందరదాసు అన్నమయ్యను శ్రీనివాసుని అవతారంగా ప్రశంసించాడంటారు. (సాక్షాత్తు శ్రీమహావిష్ణువు ఖడ్గమైన నందకం అంశతో అన్నమయ్య జన్మించాడని శ్రీవైష్ణవసంప్రదాయంలో నమ్మకం ఉన్నది. ప్రధాన మందిరంలో ఘంట అవతారమని కూడా అంటారు). త్యాగయ్య, క్షేత్రయ్య, రామదాసు వంటి సంకీర్తనాచార్యులకు అన్నమయ్య మార్గదర్శకుడు.చందమామ రావే జాబిల్లి రావే అంటే వేంకటేశుడు ముద్దలు తిన్నాడో తినలేదో కానీ, తెలుగు పిల్లలు మాత్రము గబుక్కున తింటారు. జోఅచ్యుతానంద జో జో ముకుందా అంటే ముకుందుడు నిద్ర పోతాడో లేదో కానీ తెలుగు పిల్లలు మాత్రము హాయిగా నిద్ర పోతారు. అన్నమయ్య పాటలు తెలుగు సంస్కృతికి ప్రతిరూపాలు. అవి తెలుగు సంస్కృతిలో ఒక భాగమై పోయినాయి; జనాల నోళ్ళలో నాటుకొని పోయినాయి. తుమ్మెద పాటలు, గొబ్బిళ్ళ పాటలు, శృంగార గీతాలు, ఆధ్యాత్మిక పదాలు – ఇలా మొత్తము ముప్పై రెండు వేల పాటలు వ్రాసాడు.

# వెంటనే ఏపీలో రిపోర్ట్ చేయండి

## ఐపీఎస్ ఆఫీసర్లకు ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 22, తెలంగాణలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ముగ్గురు ఐపీఎస్‌లకు కేంద్ర హోం శాఖ షాకిచ్చింది. ప్రస్తుతం ఉన్న పోస్టుల నుంచి రిలీవ్ చేస్తూ.. 24 గంటల్లోగా ఏపీలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ ముగ్గురు ఐపీఎస్‌లు ఎవరంటే.. అంజనీ కుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతి. ఈ ముగ్గురిని వెంటనే రిలీవ్ చేయాలని హోం శాఖ ఆదేశాలిచ్చింది. డీజీ అంజనీ కుమార్ ఏపీ క్యాడర్ ఐపీఎస్ అధికారిగా ఉన్నారు. ఆయన తెలంగాణ డీజీపీగా కూడా గతంలో పనిచేశారు. అభిషేక్ మహంతి ప్రస్తుతం కరీంనగర్ సీపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అభిలాష బిస్త్ తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అంజనీ కుమార్, అభిలాష బిస్త్ డీజీ ర్యాంక్‌లో ఉండగా, అభిషేక్ మహంతి ఎస్పీ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు.ఈ ముగ్గురికి కేవలం 24 గంటల సమయం మాత్రమే ఇచ్చిన కేంద్ర హోం శాఖ వెంటనే ఏపీ ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాలని ఆదేశాలిచ్చింది. అయితే ఈ ఆదేశాలపై ఐపీఎస్‌లు కొంత సమయం కావాలని కోరే అవకాశం ఉంది. మూడు నెలల క్రితం ముగ్గురు ఐఏఎస్ అధికారులను ఇలాగే బదిలీ చేసింది కేంద్ర ప్రభుత్వం. తాజాగా ఈ ముగ్గురు ఐపీఎస్‌లకు షాక్ ఇచ్చింది. తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి వీళ్లు ఇక్కడే ఉన్నారు. రాష్ట్ర విభజన జరిగిన సమయంలో ఈ ముగ్గురిని కూడా కేంద్రం ఏపీకి అలాట్ చేసింది. కానీ, ఆ నిర్ణయాన్ని వీరు ముగ్గురు సవాల్ చేస్తూ క్యాట్‌ని ఆశ్రయించారు. అక్కడ వీరి అలాట్‌మెంట్‌కు సంబంధించిన వాదనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

# మళ్లీ దడ పుట్టిస్తున్న చైనా

బీజింగ్, ఫిబ్రవరి 22,చైనా రూపొందించిన రోబో డాగ్, డ్రోన్ మధ్య పోరాట వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇప్పుడు చైనా సైన్యం చేసిన విన్యాసాలు దానికి మరింత ఊతం ఇచ్చాయి. గురువారం(ఫిబ్రవరి20) చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (ఖఒం) న్యూక్లియర్, బయోలాజికల్ అండ్ కెమికల్ డిఫెన్స్ డ్రిల్‌లో లు, రోబోటిక్ డాగ్‌లను ప్రదర్శించారు. చైనా ఇప్పుడు ఇలాంటి రోబోటిక్ కుక్కలపై దృష్టి సారించింది. రక్షణ రంగంలో ముందుకు సాగడంతో పాటు సైన్యాన్ని బలోపేతం చేసే దిశగా దీనిని ఒక పెద్ద అడుగుగా అభివర్ణిస్తున్నారు.రోబోటిక్ డాగ్‌లు శత్రువులను ఎదుర్కోవడానికి వ్యూహాన్ని మెరుగుపరుస్తాయి. సైనికుల బలిదాన ప్రమాదాన్ని తగ్గిస్తాయి. గత సంవత్సరం కూడా, చైనా తన సైన్యంలో భాగమైన రోబోటిక్ కుక్క లక్షణాలను పరిచయం చేసింది. అవి ఎలా పనిచేస్తాయో తెలుసా, చైనీయులకు ఎన్ని రకాల రోబోటిక్ కుక్కలు ఉన్నాయి, చైనా, కంబోడియా మధ్య ఉమ్మడి సైనిక విన్యాసాల వీడియో విడుదలైంది. రోబో డాగ్ సామర్థ్యాలను వీడియోలో చూపించారు. సరళంగా చెప్పాలంటే, శత్రువుల ఇళ్లలోకి ప్రవేశించి వారిపై దాడి చేయగల సైనికులకు ప్రత్యామ్నాయంగా రోబోట్ కుక్కలను తయారు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. నష్టం జరిగితే తక్కువగా ఉంటుంది. చైనా ఇప్పుడు టెక్నాలజీ సహాయంతో తన సైన్యాన్ని బలోపేతం చేసుకుంటోంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన మానవరహిత వైమానిక వాహనాలు, రోబోట్ కుక్కలు దీనికి ఉదాహరణలు.చైనా రోబో కుక్కలు నడవగలవు. పరుగెత్తవచ్చు. దూకవచ్చు, అడుగడుగునా అడుగులు వేయవచ్చు. అవసరమైనప్పుడు దూకవచ్చు కూడా. అవి అస్సాల్ట్ రైఫిళ్లను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తారు. చైనా సైన్యంలో రెండు రకాల రోబో కుక్కలు ఉన్నాయి. మొదటి కుక్క మరింత శక్తివంతమైనది. దీనికి అస్సాల్ట్ రైఫిల్ అమర్చారు. 50 కిలోల బరువున్న ఈ కుక్క తన లక్ష్యాన్ని ట్రాక్ చేస్తున్నప్పుడు తన దిశను కూడా మార్చుకుంటుంది. దాని లక్ష్యం దాని స్థానాన్ని మారుస్తుందని అనుకుందాం. అప్పుడు అది తన స్థానాన్ని మార్చుకుంటూనే తన లక్ష్యాన్ని గురి చూస్తుంది. రెండవ రోబో కుక్క బరువు 15 కిలోలు. దీనిని శత్రువుపై నిఘా పెట్టడానికి, కొన్ని నిర్దిష్ట విషయాలను గుర్తించడానికి ఉపయోగించవచ్చు.ఈ రోబోటిక్ కుక్కలను చైనీస్ స్టార్టప్ కంపెనీ యూనిట్రీ రోబోటిక్స్ అభివృద్ధి చేసిందని అనేక మీడియా నివేదికలలో పేర్కొన్నారు. అయితే, ఆ కంపెనీ దానిని చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి సరఫరా చేయడానికి నిరాకరించింది. ఈ రోబోటిక్ కుక్కలను ఎక్కడి నుండి తీసుకువస్తున్నారో చైనా సైన్యం కూడా స్పష్టం చేయలేదు.గత సంవత్సరం గోల్డెన్ డ్రాగన్ 2024 వ్యాయామంలో కూడా వీటిని ప్రదర్శించారు. ఈ సైనిక విన్యాసాలను చైనా, కంబోడియా సంయుక్తంగా 2024 మే 16 నుండి 30 వరకు నిర్వహించాయి. ఈ శిక్షణలో, చైనా సైన్యం తన బలాన్ని ప్రదర్శించింది. భూమిపై, ఆకాశంలో తన ఆధునిక ఆయుధాలను మోహరించింది. ఇప్పుడు మరోసారి చైనా రోబోటిక్ కుక్క వార్తల్లో నిలిచింది. గత నెలలో వైరల్ అయిన ఒక వీడియోలో, కుక్క డ్రోన్‌ను లక్ష్యంగా చేసుకుని దాడి చేస్తున్నట్లు కనిపించింది. ఈ వీడియోపై నెటిజన్లు రకరకాలుగా కామెంట్స్ చేస్తున్నారు.

# 4 లక్షల ఎకరాల రిజిస్ట్రేషన్లు రద్దు

విజయవాడ, ఫిబ్రవరి 22 రాష్ట్రంలో ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తామని.. రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోదియా తేల్చి చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 13 లక్షల ఎకరాల్లో.. 4 లక్షల ఎకరాలను అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు గుర్తించినట్లు ఆర్పీ సిసోడియా స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించిన రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా వెంట జిల్లా కలెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అక్రమంగా చేసిన భూముల రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తామని వెల్లడించారు.ఏపీలో దాదాపు 13 లక్షల ఎకరాలకు గానూ 4 లక్షల ఎకరాల భూములను అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు రెవెన్యూశాఖ గుర్తించినట్లు చెప్పారు. ఈ లక్షల ఎకరాల భూముల్లో 25 వేల ఎకరాల వరకు రిజిస్ట్రేషన్ చేసినట్లు వెల్లడించారు. ఆ భూముల్లో 8 వేల ఎకరాల వరకు అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తేలినట్లు స్పష్టం చేశారు. ఇక నిషేధిత జాబితా నుంచి అక్రమంగా తొలగించిన 4 లక్షల ఎకరాల భూములతోపాటు ఈ 8 వేల ఎకరాల భూముల రిజిస్ట్రేషన్లను రద్దు చేసేందుకు తక్షణ చర్యలు తీసుకున్నట్లు ఆర్పీ సిసోడియా తేల్చి చెప్పారు.గతేడాది అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దస్త్రాల కాలిపోవడంతో మొత్తం ఆఫీస్ దెబ్బతింది. ఈ క్రమంలోనే మదనపల్లె సబ్‌కలెక్టర్ ఆఫీస్‌ను పునరుద్ధరించగా.. ఆ కార్యాలయాన్ని ఆర్పీ సిసోడియా బుధవారం ప్రారంభించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన ఆయన.. ఈ విషయాలు వెల్లడించారు. ఇక ఆఫీస్ దహనం అయిన 2400 దస్త్రాలను తిరిగి రికవరీ చేసినట్లు వెల్లడించారు. కలెక్టర్, తహసీల్దార్ల కార్యాలయాల్లో ఉన్న రికార్డుల లింకు దొరకడంతో ఈ దస్త్రాలను రికవరీ చేయడం సాధ్యమైనట్లు తెలిపారు.ఈ క్రమంలోనే ఆ దస్త్రాల రికవరీలో భాగంగానే ఫ్రీహోల్డ్ భూముల అక్రమాలు బయటికి వచ్చినట్లు వెల్లడించారు. మరోవైపు.. ఈ మదనపల్లె సబ్ కలెక్టర్ ఆఫీస్ దస్త్రాల దహనం కేసులో ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే కొందరిని అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నామని.. వేరే బయటి వ్యక్తులతో సంబంధాలు ఉండడంతో దర్యాప్తు పూర్తి అయ్యేందుకు కొంత సమయం పడుతోందని వివరించారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల పోస్టులు ఖాళీగా ఉన్న విషయం వాస్తవమేనని అంగీకరించిన ఆర్పీ సిసోడియా.. ఉద్యోగ ప్రమోషన్ల విషయంలో తలెత్తిన న్యాయపరమైన వివాదాలతో ఈ పరిస్థితి తలెత్తిందని వివరించారు. కొత్త రిక్రూట్‌మెంట్లు కూడా త్వరలోనే చేపడతామని స్పష్టం చేశారు.

# సైలెంట్ గా జిల్లా టూర్లలలో జగన్



గుంటూరు, ఫిబ్రవరి 22 కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు దాటిపోయింది కానీ ప్రతిపక్ష నేతగా జగన్ తన మార్క్ చూపించడంలో విఫలమయ్యారు. ప్రధాన ప్రతిపక్ష హోదా ఆయనకు లేనప్పటికీ ఏపీలో ఉన్న ఏకైక ప్రతిపక్ష నేత మాత్రం ఆయనే. దానికి తగ్గట్లుగా పోరుబాట ఎంచుకుంటారని.. అనుకున్నారు కానీ ఆయన నింపాదిగా ఉన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగే వరకూ వేచి చూడాలని అనుకున్నారు. అందుకే కార్యకర్తలను పరామర్శించేందుకు ఆయన జిల్లాల టూర్ పెట్టుకున్నారు. కానీ దాని గురించి ఇప్పుడు మాట్లాడటం లేదు. కానీ ప్రజా సమస్యలపై మాత్రం మెల్లగా పర్యటనలు ప్రారంభించాలని డిసైడయ్యారు. జగన్ రెండు రోజుల కిందట బెంగళూరు నుంచి వచ్చారు. రాగానే విజయవాడలో వంశీని జైలులో పరామర్శించారు. అక్కడ ఓ పాప ఆయన కోసం ఏడవడం.. ఆ పాపతో సెల్ఫీ దిగడం వంటి కార్యక్రమాలతో జగన్ మళ్లీ తన రాజకీయం ప్రారంభించారని వైసీపీ నేతలు అర్థం చేసుకునారు. వెంటనే గుంటూరులో మిర్చి రైతుల పరామర్శకు అని వెళ్లారు. ఎన్నికల కోడ్ ఉన్నా సరే లెక్క చేయలేదు. అనుమతి లేని పర్యటనకు పోలీసులు కూడాపెద్దగా బందోబస్తు ఏర్పాటు చేయలేదు. ఆక్కడ ఆవేశంగా చంద్రబాబుపై విమర్శలు చేశారు. మిర్చి కోరు కారణంగా ఇబ్బంది పడినప్పటికీ కొంత మంది రైతులతో మాట్లాడి వెళ్లారు. అక్కడ కూడా జగన్ మార్క్ కనిపించింది. జగన ఇటీవలి కాలంలో ఎక్కువగా బెంగళూరులోనే ఉంటున్నారు. వారానికి మూడు లేదా నాలుగు రోజులు తాడేపల్లిలో ఉంటున్నారు. దానికి సంబంధించి ఆయన కారణాలు ఆయనకు ఉండవచ్చు కానీ ఏపీకి వచ్చిన రోజుల్లో తాడేపల్లిలో పార్టీ కార్యకర్తల సమావేశాలు నిర్వహించేవారు. అయితే ఇక నుంచి ఓ జిల్లా పర్యటనకు వెళ్లాలని అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ప్రజాసమస్యలను తీసుకుని ఆ సమస్య పరిశీలనకు జగన్ ప్రజల్లోకి వెళ్లాలని అనుకుంటున్నారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. తన ప్లాన ను బయట పెట్టలేదు కానీ అన్ ప్లాన్డ్ గానే ఆయన ప్రజల్లోకి వెళ్తే మంచి స్పందన వస్తుందని కొత్తగా వ్యూహకర్తలు ప్లాన్ రెడీ చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. అసెంబ్లీకి హాజర్యయేందుకు సిద్ధంగా లేరు. ప్రతిపక్ష నేత హోదా ఇచ్చి చంద్రబాబుతో సమానంగా మాట్లాడే అవకాశం ఇస్తేనే వస్తానని ఆయనంటున్నారు కాబట్టి హాజరయ్యే అవకాశం లేదు. అయితే అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పుడు ఆయన సైలెంట్ గా ఉండే అవకాశం లేదు. ఏదో ఓ రాజకీయ కార్యక్రమం పెట్టుకుంటారు. గతంలో ఆయన మాక్ అసెంబ్లీ నిర్వహించాలని అనుకున్నారు. కానీ నిర్వహించలేదు. ఈ సారి జనాల్లోకి వెళ్లాలని అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అసెంబ్లీకి ఎందుకు వెళ్లలేదో తన వాదన వినిపిస్తూ.. అక్కడి నుంచి ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తానని ఆయన వ్యూహాన్ని ఖరారు చేసుకునే అవకాశం ఉంది.

# చికెన్ కోసం ఎగబడ్డ జనాలు

గుంటూరు,గుంటూరులో ఉచితంగా చికెన్ పంపిణీ చేశారు పౌల్ట్రీ పరిశ్రమ నిర్వాహకులు.బర్డ్ ఫ్లూ వదంతుల తో పడిపోయిన చికెన్ అమ్మకాల ను తిరిగి పుంజుకునేలా చేసేందుకు సిద్ధమయ్యారు.నష్టాల పాలైన నేపథ్యంలో, పౌల్ట్రీ పరిశ్రమకు మద్దతుగా రంగంలోకి దిగి చికెన్ తినాలంటున్న ప్రజా ప్రతినిధులు ప్రచారం చేస్తున్నారు.ప్రజల్లో అవగా హన కల్పించే ప్రయత్నాలు చేస్తు న్నారు..

# లగడపాటి దారిలో కేశినేని నాని, కాకపోతే చిన్న ట్విస్ట్



విజయవాడ, ఫిబ్రవరి 22 బెజవాడలో రాజకీయ నేతలు ఓడిపోతే రాజకీయాలకు దూరమైనట్టేనా? కాంగ్రెస్ మాజీ ఎంపీ లగడపాటి దారిలోనే కేశినేని నాని నడుస్తున్నారా? కేశినేని నాని కామెంట్స్ వెనుక అసలేం జరుగుతోంది? నాని చూపంతా కమలంపై పడిందా? పదవి లేకపోయినా.. ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎందుకన్నారు? ఇదే చర్చ ఏపీ రాజకీయాల్లో సాగుతోంది.విజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని తిరిగి రాజకీయాల్లో యాక్టివ్ అవుతున్నట్లు కనిపిస్తోంది. విజయవాడ పార్లమెంట్ సెగ్మెంట్‌లో తిరువూరు, నందిగామ, మైలవరం ప్రాంతాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల కోసం ఇప్పటి నుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకున్నట్లు ఓ టాక్ నడుస్తోంది. తాను బరిలోకి దిగుతానని సన్నిహితుల వద్ద ఆయన చెప్పినట్టు ఓ ఫీలర్ బెడవాడ పొలిటికల్ సర్కిల్స్ లో హంగామా చేస్తోంది. ఆయన ఏ పార్టీ వైపు వెళ్తారు అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.చిరంజీవి పెట్టిన ప్రజారాజ్యం పార్టీతో రాజకీయాల్లోకి వచ్చారు కేశినేని నాని. కొద్దిరోజుల తర్వాత ఆ పార్టీకి గుడ్ బై చెప్పేశారు. కొత్త పార్టీ కంటే పాత పార్టీలే బెటరని భావించారు. ఆ తర్వాత టీడీపీలోకి ఎంట్రీ ఇచ్చారు. 2014, 19 ఎన్నికల్లో టీడీపీ నుంచి ఎంపీగా గెలిచారు. తన జిల్లాకు చెయాల్సిన పనులు చేపట్టారు. కాకపోతే రెండుసార్లు ఎంపీగా గెలవడంతో తనకు తిరుగులేదని భావించారు. ఆ తర్వాత పార్టీకి వ్యతిరేకంగా గళం వినిపించారు. గత ఎన్నికల ముందు వైసీపీ తీర్థం పుచ్చుకున్న ఆయన, తన తమ్ముడు శివనాథ్ చేతిలో ఓటమి పాలయ్యారు. ఆనాటి నుంచి రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.లేటెస్ట్‌గా నందిగామలో జరిగిన ఓ కార్యక్రమంలో మాజీ ఎంపీ కేశినేని నాని పాల్గొన్నారు. తాను రాజకీయాల నుంచి తప్పుకున్నానని, కాకపోతే ప్రజా సేవ మాత్రం వీడలేదన్నది ఆయన మాట. పదవిలో లేకపోయినా ప్రజలకు నిత్యం అందుబాటులోనే ఉంటానని తన మనసులోని మాట బయపెట్టారు. గడిచిన పదేళ్లు ఎవరి దగ్గర కప్పు టీ కూడా తాగకుండా పని చేశానని తన గురించి కాసింత మంచి మాటలు చెప్పుకొచ్చారు.ప్రస్తుతం కేశినేని నాని చూపు బీజేపీపై పడింది. ఎంపీగా ఉన్న పదేళ్ల కాలంలో బీజేపీ నేతలతో ఆయనకు మంచి సంబంధాలు ఉన్నాయి. ఈ సంబంధాలను ఉపయోగించుకుని కాషాయం పార్టీలో చేరాలని భావిస్తున్నట్లు నాని అనుచరుల మాట. మరోవైపు ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరితో ఆయన ఇప్పటికే మంతనాలు చేసినట్టు తెలుస్తోంది. ఈ విషయమై పార్టీ హైకమాండ్ తో ఆయన చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.కూతురు శ్వేతకు రాజకీయ భవిష్యత్తు ఇవ్వడం కోసం ఆయన బీజేపీని ఎంచుకున్నట్లు వార్తలు లేకపోలేదు. కేశినేని నాని చేరికను టీడీపీ అంగీకరిస్తుందా? అనేది ఇక్కడ ఆసక్తికరమైన విషయం. ఒకవేళ కేశినేని నాని బీజేపీ తీర్థం పుచ్చుకుంటే విజయవాడ రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారే అవకాశాలున్నాయి.ఒక్కసారి విజయవాడ ఎంపీ నియోజకవర్గం విషయానికొస్తే.. విజయవాడలో కంటిన్యూగా రెండుసార్లు ఎంపీగా గెలిచినవారు ఆ తర్వాత రాజకీయాలకు దూరమైన సందర్భాలు ఉన్నాయి. గతంలో ఉపేంద్ర రెండుసార్లు (1996, 1998) కాంగ్రెస్ ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరమయ్యారు. మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ కూడా అంతే. 2004, 2009 ఎన్నికల్లో ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత ఆయన గుడ్ బై చెప్పేశారు. ఇప్పుడు మాజీ ఎంపీ కేశినేని నాని వంతైంది. ఆయన కూడా 2014, 2019 ఎన్నికల్లో ఎంపీగా గెలిచి పార్లమెంటులో అడుగుపెట్టారు. ఈ క్రమంలో కేశినేని కూడా రాజకీయాలకు దూరమయ్యారు.

# తిరుపతి మేయర్ పై అవిశ్వాసం

తిరుపతి, ఫిబ్రవరి 22 కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో మార్పులు జరుగుతున్నాయి. తిరుపతిలో సైతం మార్పులు చోటు చేసుకుంటున్నాయి. త్వరలో మేయర్‌పై అవిశ్వాసానికి సిద్ధమవుతున్నట్లు కార్పొరేటర్లు చర్చించుకుంటున్నారు. తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో 3 లక్షలపైగా ఓటర్లు ఉన్నారు. ఇక్కడ 50 డివిజన్లు ఉన్నాయి. 2020లో కొవిడ్ ప్రారంభ సమయంలో కార్పొరేషన్ ఎన్నికలు జరగ్గా అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ధన, ఆర్థిక, అంగ బలంతో 50 డివిజన్లలో 25శాతం మాత్రమే ఎన్నికలు జరిగేలా చేసింది. అప్పట్లో కనీసం నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన వారి డాక్యుమెంట్లు సైతం లాకెళ్లిన ఘటనలు చూశాం. ఆ సన్నివేశాలను పోలీసులు చూస్తు ఉన్నారు తప్ప ఏమి చేయలేని పరిస్థితి. నామినేషన్లు దాఖలు చేసిన వారివి సైతం పత్రాలు చింపేసి అధికారులను అడ్డం పెట్టుకుని మరీ ఏకగ్రీవాలు చేశారు. ఆ సమయంలో కొవిడ్ కారణంగా లాక్ డౌన్ రావడంతో ఆ ఎన్నికలు వాయిదా పడ్డాయి. కొవిడ్ పరిస్థితుల తరువాత జరిగిన ఎన్నికల్లో వైసీపీ కార్పొరేటర్లు 50గాను 48 సొంత చేసుకున్నారు. 1 మాత్రమే టీడీపీ కైవసం చేసుకోగ.. 1 డివిజన్ కార్పొరేటర్ కోర్టును ఆశ్రయించగా ఎన్నికలు లేకుండా పోయింది.50 మంది కార్పొరేటర్లు మేయర్‌గా బీసీ (యాదవ) వర్గానికి చెందిన డాక్టర్ శిరీష ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్‌గా కాపు సామాజిక వర్గానికి చెందిన ముద్ర నారాయణను నిలబెట్టారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం రెండో డిప్యూటీ మేయర్ కోసం జీవో విడుదల చేయగా రెండో డిప్యూటీ మేయర్‌గా అప్పటి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు భూమన అభినయ్ రెడ్డిని ఎన్నుకున్నారు. గడిచిన నాలుగేళ్ల కాలంలో వైసీపీ తరపున కార్పొరేటర్లు నోరు సైతం మెదపకుండా వారికి కావాల్సింది చేసుకుంటూ కౌన్సిల్ సమావేశం మీడియా సైతం అనుమతి లేకుండా పాలన సాగించారు. 2024లో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం తరపున తిరుపతిలో జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు 60వేల పైగా మెజారిటీతో గెలుపొందారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 4 కార్పొరేటర్లు ఈ విజయంలో కీలక పాత్ర పోషించారు. ఎన్నికల తరువాత కొంత మంది కార్పొరేటర్లు సైతం వైసీపీ వీడి కూటమి వైపు మొగ్గు చూపినా తీసుకోవడానికి ఆసక్తి చూపలేదు. అప్పటి వరకు బాగానే ఉన్నా మేయర్ తన పదవితో ఎమ్మెల్యే సహా ఎవర్నీ మాట్లాడనీయకుండా చేశారు. కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చే కార్పొరేటర్లను టార్గెట్ చేసినట్టు చెప్పుకుంటున్నారు. ఎన్నికల్లో ఓటమి కారణంగా రెండో డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డి రాజీనామా చేశారు. డిప్యూటీ మేయర్ పోస్టు ఖాళీ కావడంతో ఇటీవల డిప్యూటీ మేయర్ పోస్టుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఎన్నికల్లో నాటకీయ పరిణామాలు జరిగాయి. ఈ డ్రామా మధ్యే 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ ముని కృష్ణ డిప్యూటీ మేయర్ ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్ ఎన్నిక తరువాత తొలి తిరుపతి కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ క్రమంలో డిప్యూటీ మేయర్‌గా ఆర్సీ ముని కృష్ణ ప్రమాణ స్వీకారం జరిగింది. ఆ తరువాత బడ్జెట్ సమావేశం నిర్వహించారు. అనంతరం అజెండా అంశాలు చర్చకు వచ్చాయి. తన ముందే డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా అధికారులు దౌర్జన్యానికి దిగారని వారిపై చర్యలు తీసుకోవాలని మేయర్ డాక్టర్ శిరీష డిమాండ్ చేశారు. దీనిపై రియాక్ట్ అయిన కమిషనర్ మౌర్య క్షమాపణ చెప్పి ఏమి జరిగిందో విచారణ చేస్తామని చెప్పారు. అయితే దానికి సంతృప్తి చెందని మేయర్ కౌన్సిల్ నుంచి బాయ్ కాట్ చేశారు. దీంతో ఏమి చేయాలో తెలియక... కోరం నిర్ణయం మేరకు జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు డిప్యూటీ మేయర్ గా ఉన్న ముద్ర నారాయణను మేయర్ గా పెట్టి కౌన్సిల్ పూర్తి చేశారు.తిరుపతి మేయర్ ఉన్న అక్రమంగా భవనాలకు ఎలా అనుమతి ఇచ్చారు. ఇంత కాలం ఏమి చేశారు. అధికారుల పై చర్యలు గతంలో ఎందుకు తీసుకోలేదని కార్పొరేటర్లు చర్చకు దిగారు. మేయర్ హోదాలో సభ నుంచి బాయ్ కాట్ చేయడం ఏంటని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలంటే అవిశ్వాసం పెట్టి ఆమెను పదవి నుంచి తొలగించాలని పావులు కదుపుతున్నారు. బీసీ (యాదవ్) సామాజికవర్గానికి చెందిన అన్నా అనిత, అన్నిత సంధ్య మేయర్ పదవి కోసం ఎదురుచూస్తుండగా ఇదే అదునుగా భావించి మరింత వేగంగా కార్పొరేటర్లతో చర్చలు జరుపుతున్నారు. మార్చి నెలలో జరిగే కౌన్సిల్ సమావేశంలో మేయర్‌పై అవిశ్వాసానికి సిద్ధమవుతున్నారు. మిగిలిన 8 నెలల కాలంలో మేయర్ పదవి సొంతం చేసుకోవడం వల్ల ఏమి లాభం ఉంటుందనేది కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. ఏమి జరుగుతుందో మార్చి వరకు వేచి చూడాల్సిందే.

# అర్ధరూపాయికి టమోటా

కర్నూలు, ఫిబ్రవరి 22, టమాటా ధరలు రోజురోజుకూ పతనం అవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కిలో రెండు రూపాయలకు కూడా మార్కెట్ లో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయడం లేదు. మొన్నటి వరకూ కిలో నలభై నుంచి యాభై వరకూ బయట మార్కెట్ లో పలికిన టమాటా ధర నేడు పది రూపాయలకు పడిపోయింది. టమాటా తినే వినియోగదారులకు ఇది లాభదాయకమే అయినప్పటికీ, దానిని పండించే రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోతున్నారు. పత్తికొండ, మదనపల్లి మార్కెట్ లో కిలో టమాటా ధర అర్థ రూపాయికి కూడా కొనేవారు లేరు. దీంతో టమాటా పండించిన రైతులు కనీసం తాము పండించిన దానికి పెట్టుబడి రాకపోవడంతో మార్కెట్ బయట పారేసి వెళుతున్నారు. మరికొందరు రైతులు మాత్రం పొలాల్లోనే పశువుల మేతగా టమాటాను వదిలేస్తున్నారు. టమాటా కోయడానికి రైతులు కూలీలకు చెల్లించాల్సిన మొత్తం కూడా రాదని తెలియడంతో దానిని కోయడం అనవసరమని పొలాల్లోనే వదిలేస్తున్నారు. పశువులకు మేతగా తీసుకెళ్లవచ్చని కొన్ని చోట్ల పశువుల కాపర్లకు రైతులు చెబుతున్నారు. దీంతో టమాటా ధరలు ఇప్పట్లో పెరిగే అవకాశం లేదని తెలిసి రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా నవంబరు మాసం నుంచి టమాటా దిగుబడులు ఎక్కువగా వస్తుంటాయి. ఇతర రాష్ట్రాల నుంచి కూడా దిగుమతి అవుతుంటాయి. అందుకే కావాల్సిన దానికన్నా ఎక్కువ టమాటా మార్కెట్ లోకి వస్తుంది. దీని వల్ల ధరలు పడిపోతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. టమాటా ధరల రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో ఏపీ ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. టమాటాకు గిట్టుబాటు ధర కల్పించేందుకు వ్యవసాయశాఖ చర్యలను ప్రారంభించింది. అనంతపురం, కర్నూలు, విజయనగరం జిల్లాల్లో ప్రభుత్వం టమాటా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. ఇప్పటివరకు రైతుల నుంచి కిలో ఎనిమిది రూపాయల చొప్పున వెయ్యి క్వింటాళ్ల టమాటా కొనుగోలు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. విజయవాడ, విశాఖ, రాజమండ్రి, గుంటూరు రైతుబజార్లలో టమాటా విక్రయాలు చేపట్టారు. నాఫెడ్, ఏపీసీఎఫ్ ద్వారా ఆపరేషనల్ ఖర్చులు భరించేలా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. కిలో టమాటాపై పది రూపాయల నుంచి పదిహేను రూపాయల గిట్టుబాటు ధర అందేలా ఏపీ వ్యవసాయశాఖ చర్యలు ప్రారంభించింది. కానీ ఇప్పటికీ రైతులు తమకు గిట్టుబాటు ధర లభించడం లేదని చెబుతున్నారు. తమిళనాడు, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో విక్రయించే కేంద్రాలతో చర్చలు ప్రారంభించింది.



# ఒక్క రోజే ప్లీనరీ

కాకినాడ ఫిబ్రవరి 22 జాతీయ పార్టీ అయినా ప్రాంతీయ పార్టీ అయినా ప్లీనరీ అంటే ఆ పార్టీ కార్యకర్తలకు అభిమాన శ్రేణులకి పండగనే చెప్పాలి. సాధారణంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లీనరీలు ఏర్పాటు చేస్తుంటారు పార్టీల అధినేతలు. పార్టీ శ్రేణులకు భవిష్యత్తు దిశా నిర్దేశం చేయడానికి ప్లీనరీలను ఏర్పాటు చేస్తాయి రాజకీయ పార్టీలు. పవన్ కల్యాణ్ లాంటి విపరీతమైన జనాకర్షణ ఉన్న నాయకుడు తన పార్టీకి ప్లీనరీ ఏర్పాటు చేస్తే ఆయన అభిమానులకు కార్యకర్తలకు ఎంతటి ఉత్సాహం ఉంటుందో చెప్పనక్కర్లేదు. ఇప్పుడు జనసేన నేతలు, ఆయన అభిమానులు దాని కోసమే ఎదురు చూస్తున్నారు. పార్టీ స్థాపించిన పదేళ్లకు అధికారంలోకి వచ్చాం ప్లీనరీ ధూంధాంగా చేస్తారని రెండు రాష్ట్రాల్లోని జనసైనికులు ఎంతగానో ఎదురు చూస్తూ ఉన్నారు. ఇదిగో అదిగో అంటూ చాలా కాలం నుంచి వారిని ఊరిస్తూ వచ్చిన పార్టీ చివరకు విషయాన్ని చాలా కూల్‌గా చెప్పేసింది. ఈసారి పవన్ కల్యాణ్ సొంత నియోజకవర్గంలో గ్రాండ్‌గా సెలబ్రేట్ చేయబోతున్నారని పేర్కొంది. అయితే అందులో కూడా భారీ ట్విస్ట్ ఇచ్చింది జనసేన అధినాయకత్వం. కొద్ది కాలంగా ప్రచరాంలో ఉన్నట్టు మూడు రోజులు కాకుండా కేవలం ఒక్కరోజుకే ప్లీనరీని పరిమితం చేసింది. నిన్న మొన్నటి వరకు పిఠాపురంలో ఈ ప్లీనరీ మూడు రోజులు పాటు జరుగుతుంది జోరుగా ప్రచారం జరిగింది. దీనిపై జనసేన హైకమాండ్ నీళ్లు చల్లి ఒక్క రోజుకే పరిమితం కావడంతో జన సైనికుల్లో నిరాశ కనిపిస్తోంది.అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి జరుగుతున్న పార్టీ ప్లీనరీ అందులోనూ అధినాయకుడు పవన్ కల్యాణ్ రికార్డు మెజారిటీతో గెలిచిన పిఠాపురంలో తొలి ప్లీనరీ. జన సైనికులు ఆనందంతో ఉప్పొంగిపోవడానికి ఈ ప్రకటన చాలు. మొదట్లో దానికి అనుగుణంగానే మూడు రోజులపాటు అంటే మార్చి 12 నుంచి 14 వరకు ప్లీనరీ జరుగుతుందని భావించారు. అందుకు తగ్గట్టుగానే పార్టీ ప్రతినిధులతో సమావేశం, శ్రేణులకు దిశా నిర్దేశం జరిగిపోయింది. జన సైనికులను ప్రజలను ఉద్దేశించి బహిరంగ సభ అందులో పవన్ ప్రసంగం ఇలా పక్కా ప్లాన్‌తో మూడు రోజుల పాటు ప్లీనరీ సంబరం జరుగుతుందని అంతా భావించారు. ఈవిషయాన్ని జనసేన ముఖ్య నేతలు నాదెండ్ల మనోహర్ సహా ఇతర కీలక నేతలు జనవరిలోనే ప్రకటించారు. కాని సడన్‌గా ప్లీనరీ ఒక్కరోజే జరుగుతుందని జనసేన నుంచి ప్రకటన వెలువడింది. పార్టీ ఆవిర్భవించిన మార్చి 14 బహిరంగ సభ ఉంటుందని ప్రస్తుతానికి స్పష్టత వచ్చింది. పార్టీ ప్రతినిధుల సమావేశం అదే రోజు ఉదయం పూట జరుగుతుందా లేక అది రద్దు అవుతుందా అని దానిపై ప్రస్తుతానికి స్పష్టత రాలేదు.ఇటీవల పవన్ కల్యాణ్ అస్వస్థతకు లోనైనట్లు జనసేన వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల జరిగిన క్యాబినెట్ మీటింగ్‌కి ఆయన అటెండ్ కాలేదు.


# మీ ఎముకలు పెళ పెళ విరిగిపోతున్నాయా? అయితే మీ ఒంట్లో ఆ ఒక్కటి తగ్గినట్లే!



మెగ్నీషియం మన శరీరానికి అత్యంత కీలకమైన ఖనిజాలలో ఒకటి. ఇది నరాల కండరాల పనితీరును నియంత్రించడం, రక్తపోటును సమతుల్యం చేయడం, ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, శక్తి ఉత్పత్తిని పెంచడం వంటి అనేక శారీరక ప్రక్రియలకు అవసరం. అయితే, మన శరీరంలో మెగ్నీషియం స్థాయి తక్కువైతే, అది అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. దీన్ని మెగ్నీషియం లోపం లేదా హైపోమెగ్నీసేమియా అంటారు. మెగ్నీషియం లోపం లక్షణాలు: మెగ్నీషియం కండరాల సడలింపుకు సహాయపడుతుంది. లోపం ఉన్నప్పుడు కండరాల నొప్పులు, తిమ్మిర్లు మరియు బలహీనత ఏర్పడవచ్చు. శక్తి ఉత్పత్తిలో మెగ్నీషియం కీలక పాత్ర పోషిస్తుంది. లోపం ఉన్నప్పుడు, అలసట, నీరసం, నిస్సత్తువగా అనిపించవచ్చు.తలనొప్పి, మైగ్రేన్ వచ్చే అవకాశం ఉంది.మెగ్నీషియం నాడీ వ్యవస్థను శాంతపరచడానికి సహాయపడుతుంది. లోపం ఉన్నప్పుడు, ఆందోళన, చిరాకు, నిద్రలేమి సమస్యలు రావచ్చు. తీవ్రమైన మెగ్నీషియం లోపం ఉన్నప్పుడు వికారం మరియు వాంతులు సంభవించవచ్చు. మెగ్నీషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. లోపం ఉన్నప్పుడు, అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం ఉంది.మెగ్నీషియం గుండె యొక్క సాధారణ లయను నిర్వహించడానికి సహాయపడుతుంది. లోపం ఉన్నప్పుడు, గుండె దడ, క్రమరహిత గుండె స్పందనలు సంభవించవచ్చు. మెగ్నీషియం ప్రేగు కదలికలను నియంత్రించడంలో సహాయపడుతుంది. లోపం ఉన్నప్పుడు, మలబద్ధకం సమస్య ఏర్పడవచ్చు. ఆకలి తగ్గడం లేదా పూర్తిగా లేకపోవడం జరుగుతుంది. మెగ్నీషియం లోపానికి కారణాలు: ఆకుకూరలు, నట్స్, విత్తనాలు, తృణధాన్యాలు , డార్క్ చాక్లెట్ వంటి మెగ్నీషియం అధికంగా ఉండే ఆహారాలను తగినంతగా తీసుకోకపోవడం . క్రాన్'స్ వ్యాధి, సెలియక్ వ్యాధి మరియు దీర్ఘకాలిక అతిసారం వంటి జీర్ణ సమస్యలు మెగ్నీషియం శోషణను తగ్గిస్తాయి. మధుమేహం ఉన్నవారిలో మూత్రం ద్వారా మెగ్నీషియం ఎక్కువగా విసర్జించబడుతుంది. మూత్రపిండాల వ్యాధి ఉన్నవారిలో మెగ్నీషియం సరిగా విసర్జించబడదు. అధిక మద్యపానం మెగ్నీషియం లోపానికి దారితీస్తుంది. డ్యూరెటిక్స్, యాంటీబయాటిక్స్ మరియు ప్రోటాన్ పంప్ ఇన్హిబిటర్స్ వంటి కొన్ని మందులు మెగ్నీషియం శోషణను తగ్గిస్తాయి. మెగ్నీషియం లోపం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు: మెగ్నీషియం లోపం గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. అధిక రక్తపోటుకు దారితీస్తుంది. మధుమేహం వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. మెగ్నీషియం ఎముకల ఆరోగ్యానికి అవసరం. లోపం ఉన్నప్పుడు ఎముకలు బలహీనపడి బోలు ఎముకల వ్యాధి వచ్చే ప్రమాదం ఉంది. మైగ్రేన్ తలనొప్పిని ప్రేరేపిస్తుంది. మెగ్నీషియం లోపం ఆందోళన, నిరాశ మరియు ఇతర మానసిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. మెగ్నీషియం లోపం యొక్క లక్షణాలు కనిపిస్తే, వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది. వైద్యుడు రక్త పరీక్ష ద్వారా మెగ్నీషియం స్థాయిలను తనిఖీ చేసి, అవసరమైతే సప్లిమెంట్లను సిఫారసు చేయవచ్చు.

# ఈ పార్ట్స్‌లో నొప్పి వస్తుందా.. ఇది కిడ్నీలు డ్యామేజ్‌కు సంకేతమే.. చెక్ చేసుకోండి.!

మూత్రపిండాలు మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాలలో ఒకటి. అవి రక్తాన్ని శుద్ధి చేసి, హానికరమైన వ్యర్థాలను మూత్ర రూపంలో బయటకు పంపించడానికి సహాయపడతాయి. అవి ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడటానికి, ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి అవసరమైన హార్మోన్లను ఉత్పత్తి చేయడానికి కూడా సహాయపడతాయి. అయితే, కొన్ని ఆరోగ్య సమస్యలు లేదా అనారోగ్య పరిస్థితుల వల్ల మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. మూత్రపిండాల పనితీరు దెబ్బతిన్నప్పుడు శరీరంలో అనేక మార్పులు వస్తాయి. అవి ముందుగా స్వల్ప లక్షణాలతో మొదలై, క్రమంగా తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది. మూత్రపిండాలు దెబ్బతిన్నప్పుడు కనిపించే సంకేతాలు, అలాగే నొప్పి కలిగించే శరీర భాగాలను వివరంగా తెలుసుకుందాం.. సాధారణ సంకేతాలు – లక్షణాలు మూత్రపిండాల వ్యాధి యొక్క సాధారణ లక్షణం అలసట. మూత్రపిండాలు సరిగా పనిచేయకపోవడం వల్ల శరీరంలో విషపదార్థాలు చేరడం వల్ల ఇది సంభవించవచ్చు. అలసటతో పాటు, బలహీనత కూడా మూత్రపిండాల నష్టం యొక్క లక్షణం. ఇది రక్తహీనత లేదా ఎలక్ట్రోలైట్ అసమతుల్యత వల్ల సంభవించవచ్చు. మూత్రపిండాలు దెబ్బతిన్నప్పుడు, అవి శరీరం నుండి అదనపు ద్రవాన్ని తొలగించలేవు. ఇది ఊపిరితిత్తులలో ద్రవం చేరడానికి దారితీస్తుంది, దీనివల్ల శ్వాస ఆడకపోవచ్చు.మూత్రవిసర్జన సమస్యలు మూత్రపిండాల వ్యాధి తరచుగా కాళ్ళు, చీలమండలు, పాదాలు, చేతులు లేదా ముఖంలో వాపుకు కారణమవుతుంది. ఇది శరీరం అదనపు ద్రవాన్ని నిలుపుకోవడం వల్ల సంభవిస్తుంది. మూత్రపిండాల వ్యాధి మూత్రవిసర్జన యొక్క పరిమాణం, రంగులో మార్పులకు కారణమవుతుంది. మీరు తక్కువ తరచుగా లేదా ఎక్కువ తరచుగా మూత్రవిసర్జన చేయవలసి రావచ్చు, లేదా మీ మూత్రం ముదురు రంగులో లేదా నురుగుతో కూడినది కావచ్చు. మూత్రపిండాల వ్యాధి ఆకలిని తగ్గిస్తుంది, ఇది బరువు తగ్గడానికి దారితీస్తుంది. శరీరంలో వ్యర్థ పదార్థాలు చేరడం వల్ల వికారం , వాంతులు వస్తాయి. ఈ వ్యాధి చర్మంపై దద్దుర్లు మరియు దురదకు కారణమవుతుంది. ఇది రక్తంలో వ్యర్థ పదార్థాలు చేరడం వల్ల సంభవిస్తుంది. మూత్రపిండాల వ్యాధి అభిజ్ఞా పనితీరును ప్రభావితం చేస్తుంది, ఏకాగ్రత మరియు జ్ఞాపకశక్తి సమస్యలకు దారితీస్తుంది. ఖనీలివతీవట ఃఎ మూత్రపిండాలు దెబ్బతిన్నప్పుడు నొప్పిని కలిగించే శరీర భాగాలు: మూత్రపిండాలు పక్కటెముకల క్రింద, వెనుక వైపున ఉంటాయి. మూత్రపిండాల నష్టం ఈ ప్రాంతంలో నొప్పిని కలిగిస్తుంది, ఇది పదునైనదిగా లేదా నిస్తేజంగా ఉంటుంది. మూత్రపిండాల నొప్పి తరచుగా వెన్నునొప్పిగా అనుభూతి చెందుతుంది. ఇది నడుము నొప్పి, ఇది పక్కటెముకల క్రింద మరియు వెన్నెముకకు ఇరువైపులా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో, మూత్రపిండాల నొప్పి కడుపు నొప్పిగా కూడా అనుభూతి చెందుతుంది. మూత్రపిండాల వ్యాధి నరాల దెబ్బతినడానికి కారణమవుతుంది, ఇది కాళ్ళు మరియు పాదాలలో నొప్పి, తిమ్మిరి లేదా జలదరింపుకు దారితీస్తుంది. ' మూత్రపిండాల వ్యాధి యొక్క ప్రారంభ దశల్లో తరచుగా గుర్తించదగిన లక్షణాలు ఉండవని గమనించడం ముఖ్యం. అందువల్ల, మీకు ఏవైనా ప్రమాద కారకాలు ఉంటే, మీరు క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించి తనిఖీలు చేయించుకోవడం చాలా ముఖ్యం. మూత్రపిండాల వ్యాధిని ముందస్తుగా గుర్తించడం వలన దాని పురోగతిని నెమ్మదిగా లేదా నిరోధించడానికి సహాయపడుతుంది. ఆరోగ్యకరమైన ఆహారం, తగినంత నీరు త్రాగడం, క్రమం తప్పని వ్యాయామం చేయడం ద్వారా మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.



# షుగర్ వ్యాధిగ్రస్తులకు దివ్యౌషధం.. ఈ ఆకు తింటే చాలు కొలెస్ట్రాల్ కూడా కరిగిపోవాల్సిందే!

భారతదేశంలో జామకాయ చాలా సాధారణంగా లభించే పండు. ఇది రుచిగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. జామ పండు మాత్రమే కాదు, జామ ఆకులు కూడా ఆరోగ్యానికి చాలా మంచిదని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా మధుమేహం (ఆతిజీఎవబివబ) ఉన్నవారికి జామ ఆకులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. జామ ఆకుల్లో యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది: జామ ఆకుల్లో ఉండే కొన్ని ప్రత్యేకమైన సమ్మేళనాలు ఆహారం ద్వారా శరీరంలోకి చేరిన గ్లూకోజ్‌ను నియంత్రించడంలో సహాయపడతాయి. ఇవి కార్బోహైడ్రేట్ల శోషణను తగ్గిస్తాయి. తద్వారా రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. జామ ఆకుల టీ తాగడం వల్ల టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారిలో రక్తంలో చక్కెర స్థాయి తగ్గుతుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇన్సులిన్ నిరోధకత అనేది టైప్ 2 డయాబెటిస్‌కు ఒక ముఖ్య కారణం.



జామ ఆకులు ఇన్సులిన్ నిరోధకతను తగ్గించడంలో సహాయపడతాయి. దీనివల్ల శరీర కణాలు ఇన్సులిన్‌కు మరింత సున్నితంగా స్పందిస్తాయి. ఇది రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించడానికి సహాయపడుతుంది.¯ కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది: డయాబెటిస్ ఉన్నవారిలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. జామ ఆకులు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో సహాయపడతాయి. ఇది గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ ఆకుల్లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. ఫ్రీ రాడికల్స్ కణాలను దెబ్బతీస్తాయి. దీనివల్ల డయాబెటిస్ సమస్య మరింత తీవ్రమవుతుంది. జామ ఆకుల్లోని యాంటీఆక్సిడెంట్లు ఈ నష్టాన్ని నివారిస్తాయి. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: జామ ఆకుల్లో విటమిన్ సి, ఇతర పోషకాలు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి. డయాబెటిస్ ఉన్నవారికి రోగనిరోధక శక్తి చాలా అవసరం, ఎందుకంటే వారి శరీరం ఇన్ఫెక్షన్లకు గురయ్యే అవకాశం ఉంది. జామ ఆకులు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇది మలబద్ధకం వంటి సమస్యలను నివారిస్తుంది. మంచి జీర్ణక్రియ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. జామ ఆకులను ఎలా ఉపయోగించాలి: కొన్ని జామ ఆకులను నీటిలో వేసి మరిగించి టీలా తయారు చేసుకోవచ్చు. ఈ టీని రోజుకు ఒకటి లేదా రెండుసార్లు తాగవచ్చు. జామ ఆకులను నీటిలో వేసి బాగా మరిగించి, ఆ నీటిని కషాయంలా తాగవచ్చు. జామ ఆకులను ఎండబెట్టి పొడి చేసి, ఆ పొడిని ఆహారంలో కలుపుకోవచ్చు.అయితే గర్భిణులు , పాలిచ్చే తల్లులు జామ ఆకులను ఉపయోగించే ముందు వైద్యుడిని సంప్రదించాలి. మీరు ఇప్పటికే మధుమేహం కోసం మందులు వాడుతుంటే, జామ ఆకులను ఉపయోగించే ముందు మీ వైద్యుడిని సంప్రదించడం ముఖ్యం. ఎందుకంటే జామ ఆకులు రక్తంలో చక్కెర స్థాయిని తగ్గిస్తాయి. దీనివల్ల మందుల మోతాదును మార్చవలసి రావచ్చు.

# పుదీనా ఆకులను వేసవిలో తప్పనిసరిగా తీసుకోవాల్సిందే.. ఎందుకంటే..?


వేసవి కాలం ప్రారంభం అయినప్పటి నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తుంటాడు. దీంతో ఓ వైపు ఎండలు మండిపోతూ ఉంటాయి. మరోవైపు వేసవి తాపం పెరుగుతుంది. వేసవి మనకు అనేక అనారోగ్య సమస్యలను కూడా తెచ్చి పెడుతుంది. ఈ సీజన్‌లో ఆరోగ్యం పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలి. లేదంటే శరీరంలో ద్రవాలు అన్నీ ఖర్చయిపోతాయి. శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. ఈ సమయంలో ఎండలో తిరిగితే ఎండ దెబ్బ బారిన కూడా పడతారు. కనుక వేసవి కాలంలో ఆరోగ్యకరమైన ఆహారాలే కాకుండా శరీరాన్ని చల్లబరిచే ఆహారాలను కూడా తీసుకోవాలి. ఇలాంటి వాటిల్లో మనకు ముందుగా గుర్తుకు వచ్చేది పుదీనా. పుదీనా ఆకులు ఎంతో తాజాదనాన్ని అందిస్తాయి. ఇవి మనకు చల్లదనాన్ని అందిస్తాయి. అందుకనే చాలా మంది వేసవిలో తలకు పెట్టుకునే షాంపూలతోపాటు జుట్టుకు రాసుకునే ఆయిల్స్ కూడా పుదీనా ఉన్నవి వాడుతుంటారు. అయితే ఈ సీజన్‌లో పుదీనా నీళ్లను తాగితే అనేక ప్రయోజనాలను పొందవచ్చు.పుదీనా ఆకులను రాత్రంతా నీటిలో వేసి అలాగే ఉంచాలి. మరుసటి రోజు ఆ నీళ్లను తాగాలి. లేదా పుదీనా ఆకుల నుంచి తీసిన రసాన్ని చల్లని నీటిలో కలిపి తాగవచ్చు. లేదా పుదీనా ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగవచ్చు. ఇక పుదీనా ఆకులను నేరుగా నమిలి తినవచ్చు లేదా రసం కూడా తీసుకోవచ్చు. ఇలా పుదీనాను అనేక రకాలుగా తీసుకోవచ్చు. దీంతో అనేక లాభాలు కలుగుతాయి. పుదీనా జీర్ణ సమస్యలను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. పుదీనా ఆకులకు శరీరాన్ని చల్లబరిచే గుణం ఉంది. కనుక జీర్ణ వ్యవస్థలో ఉండే మంట తగ్గుతుంది. జీర్ణక్రియ మెరుగు పడుతుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్దకం నుంచి ఉపశమనం లభిస్తుంది.గుండె ఆరోగ్యానికి..పుదీనాను తీసుకుంటే శరీరంలోని ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. ముఖ్యంగా రోజంతా ఎండలో తిరిగే వారికి ఇది ఎంతో మేలు చేస్తుంది. జీవక్రియలు సరిగ్గా నిర్వహించబడతాయి. పుదీనా ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడి, వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల



క్యాన్సర్, గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. పుదీనా ఆకులను నమలడం వల్ల నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. పుదీనా ఆకులను వేసి మరిగించిన నీళ్లను తాగితే ఆ వాసనకు ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మనస్సు ప్రశాంతంగా మారుతుంది.చర్మ సంరక్షణకు..పుదీనా ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల పుదీనా ఆకులను పేస్ట్‌లా చేసి ముఖానికి ఫేస్ ప్యాక్‌లా ఉపయోగించవచ్చు. దీంతో చర్మంపై ఉండే ముడతలు, మచ్చలు తగ్గిపోతాయి. ముఖం కాంతివంతంగా మారి సహజసిద్ధమైన నిగారింపును సొంతం చేసుకుంటుంది. చర్మం యవ్వనంగా కనిపిస్తుంది. పుదీనా ఆకులను వేసి మరిగించిన నీళ్లను తాగితే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయ పడుతుంది. శ్వాసకోశ సమస్యలు ఉన్నవారికి కూడా పుదీనా మేలు చేస్తుంది. ఈ ఆకులను నమిలి తింటున్నా లేదా నీళ్లను తాగుతున్నా దగ్గు, జలుబు, ఆస్తమా వంటి శ్వాస సమస్యలు తగ్గుతాయి. ఊపిరితిత్తులు, గొంతులో ఉండే కఫం కరిగిపోతుంది. శ్వాస సరిగ్గా ఆడుతుంది. ఇలా పుదీనా ఆకులతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# శరీరంలో అధికంగా నీరు చేరి అవయవాలు వాపులకు గురయ్యాయా..? ఈ చిట్కాలను పాటించండి..!

ఇటవఎజీ ఊనీఎవ ఖీవఎవటతివబ । నేటి తరుణంలో చాలా మంది పాటిస్తున్న అస్తవ్యస్తమైన జీవన విధానం వల్ల అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. ముఖ్యంగా శరీరంలో కొవ్వు అధికంగా చేరి బరువు పెరుగుతున్నారు. దీంతో డయాబెటిస్, గుండె జబ్బులు వస్తున్నాయి. అయితే చాలా మందికి కిడ్నీ సమస్యలు కూడా వస్తున్నాయి. కిడ్నీ ఫెయిల్యూర్ అనేది చాప కింద నీరులా విస్తరిస్తోంది. కిడ్నీలు ఫెయిల్ అయ్యేందుకు అనేక కారణాలు ఉంటాయి. డయాబెటిస్ ఉండడం, మూత్రాశయ ఇన్ఫెక్షన్లు దీర్ఘకాలంగా ఉండడం, శరీరంలో సోడియం స్థాయిలు పెరిగిపోవడం, ఉప్పు అధికంగా తినడం, నీరు ఎక్కువగా చేరడం వంటి అనేక కారణాల వల్ల కిడ్నీలు ఫెయిల్ అవుతుంటాయి. అయితే శరీరంలో నీరు చేరితే మనకు సులభంగా తెలిసిపోతుంది. దీన్నుంచి బయట పడడం ద్వారా కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.కిడ్నీలు చెడిపోయే ప్రమాదం..శరీరంలో అధికంగా నీరు చేరినప్పుడు శరీరంలోని పలు భాగాలు వాపులకు గురవుతాయి. దీన్నే వైద్య పరిభాషలో ఎడిమా అంటారు. ఇలాంటి స్థితి వస్తే పాదాలు, అర చేతులు వాపులకు గురై కనిపిస్తాయి. ముఖ్యంగా పాదాల మడమలపై వేలితో టచ్ చేస్తే అక్కడి చర్మం గుంతలా పడి లోపలికి వెళ్తుంది. దీన్ని బట్టి శరీరంలో నీరు అధికంగా చేరిందని అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి సమస్య గనక ఎవరికైనా ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకండి. వెంటనే డాక్టర్‌ను కలిసి చికిత్స తీసుకోవాలి. లేదంటే దీర్ఘకాలంలో కిడ్నీలు చెడిపోయే ప్రమాదం ఉంటుంది. ఇక ఈ సమస్యకు వైద్యులు ఇచ్చే మందులను వాడడంతోపాటు పలు ఇంటి చిట్కాలు కూడా పనిచేస్తాయి. వాటిని పాటించడం ద్వారా శరీరంలో అధికంగా చేరిన నీటిని బయటకు పంపించవచ్చు.పొటాషియం ఆహారాలు..పొటాషియం అధికంగా ఉండే ఆహారాలను తినడం వల్ల శరీరంలో సోడియం స్థాయిలు తగ్గిపోతాయి. దీంతో నీరు బయటకు పోతుంది. ముఖ్యంగా అరటి పండ్లు, బొప్పాయి, ద్రాక్ష, యాప్రికాట్స్ వంటి పండ్లతోపాటు బీట్ రూట్, అవకాడో, క్యాప్సికం, నిమ్మ, టమాటా వంటి కూరగాయలను కూడా ఆహారంలో భాగం చేసుకోవాలి. దీంతో శరీరంలో అధికంగా ఉండే నీరు బయటకు పోతుంది. మెగ్నీషియం అధికంగా ఉండే ఆహారాలను తింటున్నా కూడా ఈ సమస్య నుంచి బయట పడవచ్చు. మెగ్నీషియం మనకు ఎక్కువగా నట్స్, విత్తనాలు, తృణ ధాన్యాలు, మిల్లెట్లు, ఆకుపచ్చని కూరగాయల్లో లభిస్తుంది. వీటిని రోజూ తింటున్నా ఫలితం ఉంటుంది.హెర్బల్ టీలు..గ్రీన్ టీ, మందార పువ్వుల టీ, కమోమిల్ టీ వంటి హెర్బల్ టీలను సేవిస్తుండాలి. ఈ టీలలో యాంటీ ఆక్సిడెంట్లు, బయో యాక్టివ్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి శరీరంలోని వ్యర్థాలు, టాక్సిన్లను బయటకు పంపుతాయి. దీంతో అధికంగా ఉండే నీరు కూడా బయటకు పోతుంది. రాత్రి పూట నిద్రించేటప్పుడు పాదాలు కాస్త ఎత్తులో ఉండేలా చూసుకోవాలి. దీని వల్ల పాదాల్లో నీరు చేరదు. అలాగే రోజుకు కనీసం 3 లీటర్ల నీళ్లను తాగాల్సి ఉంటుంది. నీళ్లకు నీళ్లతోనే సమాధానం చెప్పాలి. శరీరంలో అధికంగా ఉన్న నీరు బయటకు పోవాలంటే మనం కూడా బయటి నుంచి శరీరానికి ఎక్కువ నీళ్లను అందించాలి. దీని వల్ల శరీరం అంతర్గతంగా శుభ్రమవుతుంది. అలాగే రోజుకు కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి. దీని వల్ల కూడా శరీరంలో అధికంగా ఉండే నీటిని బయటకు పంపించవచ్చు. ఇలా కొన్ని చిట్కాలను పాటిస్తే ఈ సమస్య తగ్గుతుంది. కిడ్నీలు ఫెయిల్ అవకుండా ఉంటాయి.




# చరణ్ – బుచ్చిబాబు మూవీ మ్యూజిక్ చాలా ఖరీదు గురూ..!



రామ్ చరణ్ గత చిత్రం 'గేమ్ ఛేంజర్' బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడటంతో మెగా ఫ్యాన్స్ అంతా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా కోసం వెయిట్ చేస్తున్నారు. మొదటి సినిమా ఉప్పెనతో వంద కోట్లకు పైగా వసూళ్లు రాబట్టిన దర్శకుడు బుచ్చిబాబు దర్శకత్వంలో రామ్ చరణ్ సినిమా అనగానే అంచనాలు పెరిగాయి. సుకుమార్ శిష్యుడు అయిన బుచ్చిబాబు గురువుకు ఏమాత్రం తగ్గకుండా సినిమాలు చేస్తాడు అని ఉప్పెన సినిమా చూసిన సమయంలోనే క్లారిటీ వచ్చింది. దాదాపు రెండేళ్ల పాటు ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేసి ఎట్టకేలకు రామ్ చరణ్‌తో సినిమా షూటింగ్‌ను బుచ్చిబాబు మొదలు పెట్టిన విషయం తెల్సిందే. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాను ఇదే ఏడాదిలో విడుదల చేయాలని బుచ్చిబాబు ప్లాన్ చేస్తున్నాడు. ఇప్పటికే చాలా ఎక్కువ సమయం ఆయన ఈ సినిమా కోసం తీసుకున్నాడు. కనుక ఇప్పుడు ఏమాత్రం సమయం వృదా చేయకుండా వరుస షెడ్యూల్స్‌తో ఆగస్టు వరకు షూటింగ్ పూర్తి చేయాలని భావిస్తున్నాడు. ఇప్పటికే రెహమాన్‌తో తనకు కావాల్సిన పాటలను ట్యూన్ చేయించుకున్నాడు. బుచ్చిబాబు ఈ సినిమా కోసం రెహమాన్‌తో ఎందుకు వర్క్ చేయాలి అనుకున్నాడు అనే విషయం సినిమా విడుదల తర్వాత తెలుస్తుంది అంటూ మేకర్స్‌తో పాటు, సినిమా కోసం వర్క్ చేసే వారు అంటున్నారు. ఈమధ్య కాలంలో తెలుగులో రెహమాన్ సినిమాలు చాలా తక్కువగా చేస్తున్నారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో ఉన్న టాప్ మ్యూజిక్ కంపోజర్స్ నాలుగు నుంచి అయిదు కోట్ల రూపాయల పారితోషికం అందుకుంటున్నారు. కానీ రెహమాన్ దాదాపు డబుల్ పారితోషికం డిమాండ్ చేస్తున్నారు. రామ్ చరణ్ – బుచ్చిబాబు సినిమా కోసం రెహమాన్ ఏకంగా రూ.8 కోట్ల పారితోషికం అందుకుంటున్నాడు అనే వార్తలు వస్తున్నాయి. బాలీవుడ్‌లో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ బుచ్చిబాబు స్పెషల్ రిక్వెస్ట్‌తో పాటు, రామ్ చరణ్ సినిమా కావడంతో రెహమాన్ ఈ సినిమాకు సంగీతాన్ని అందించేందుకు కమిట్ అయ్యారు అని తెలుస్తోంది. ంహమాన్‌తో పెట్టుకుంటే సినిమా ఆలస్యం అవుతుందని అంటారు. బుచ్చిబాబు అందుకే ముందస్తుగా మూడు నాలుగు పాటలను రెడీ చేయించుకున్నాడు. త్వరలోనే వాటి రికార్డింగ్ పూర్తి చేసి షూటింగ్ సైతం పూర్తి చేయాలని భావిస్తున్నాడు. ఎప్పటికప్పుడు బీజీఎం సైతం వస్తూనే ఉంది. రెహమాన్ కారణంగా సినిమా ఆలస్యం అయ్యే పరిస్థితి లేకుండా బుచ్చిబాబు ముందస్తు వ్యూహం తో ఉన్నాడు. భారీ పారితోషికం ఇచ్చి ఈ సినిమాకు రెహమాన్‌తో సంగీతాన్ని చేయించాల్సిన అవసరం ఏంటి అనేది సినిమా విడుదల అయితే క్లారిటీ వచ్చే అవకాశాలు ఉన్నాయి. త్వరలోనే ఈ సినిమా టైటిల్‌ను రివీల్ చేయడంతో పాటు టీజర్‌ను విడుదల చేయబోతున్నట్లు తెలుస్తోంది. రామ్ చరణ్ బర్త్‌డే స్పెషల్ ట్రీట్ కోసం అంతా ఎదురు చూస్తున్నారు. ఆ టీజర్‌తోనే రెహమాన్ పవర్ మరోసారి తెలుగు ప్రేక్షకులకు చూపించబోతున్నాడు. ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తూ ఉండగా కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ ముఖ్య పాత్రలో నటించనున్నారు అనే వార్తలు వస్తున్నాయి.



# త్వరలోనే రాజమౌళి ప్రెస్‌మీట్?



దర్శక ధీరుడు రాజమౌళి దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఇండియన్ సినిమాలో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాల్లో ఇది ఒకటి. భారీ అంచనాలతో చాలా గ్రాండ్ స్కేల్ లో ఈ సినిమా తెరకెక్కుతుంది. మహేష్ కెరీర్లో 29వ సినిమాగా రూపొందుతున్న ఈ మూవీ గురించి ఇప్పుడో ఇంట్రెస్టింగ్ అప్డేట్ వినిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ లో వేసిన ప్రత్యేక సెట్స్ లో జరుగుతుంది. సినిమా సెట్స్ పైకి వెళ్లాక ఇదే మొదటి షెడ్యూల్. అయితే ఫస్ట్ షెడ్యూల్ పూర్తయ్యాక రాజమౌళి ప్రెస్ మీట్ ను నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నాడని తెలుస్తోంది. మామూలుగా తాను చేస్తున్న సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లే ముందు సినిమాలోని నటీనటులు, తన టీమ్ తో భారీ ప్రెస్ మీట్ నిర్వహించి అందులో నటించేబోయే క్యాస్టింగ్, టెక్నికల్ టీమ్ తో పాటూ సినిమా ఏ జానర్ లో, ఎలాంటి బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కనుందనే విషయాల్ని రివీల్ చేసేవాడు. తన గత సినిమా ఆర్ఆర్ఆర్ కు కూడా రాజమౌళి దీన్నే ఫాలో అయ్యాడు. కానీ ఇప్పుడు మహేష్ బాబుతో చేస్తున్న సినిమా విషయంలో మాత్రం రాజమౌళి మొదటి నుంచి సైలెంట్ గానే ఉంటూ వస్తున్నాడు. తాజా సమాచారం ప్రకారం, ప్రస్తుతం జరుగుతున్న షెడ్యూల్ షూటింగ్ పూర్తైన తర్వాత రాజమౌళి ప్రెస్ మీట్ నిర్వహించి ఎస్ఎస్ఎంబీ29 గురించి అనేక ఆసక్తికర విషయాలను వెల్లడించనున్నట్టు తెలుస్తోంది. సినిమాకు సంబంధించిన అన్ని వివరాలను జక్కన్న ఈ ప్రెస్ మీట్ లో రివీల్ చేసే ఛాన్సుంది. అంతేకాదు, ఈ ప్రెస్ మీట్ తోనే రాజమౌళి ఎస్ఎస్ఎంబీ29కు సంబంధించిన ప్రమోషన్స్ ను కూడా స్టార్ట్ చేయనున్నాడు. త్వరలోనే ఈ ప్రెస్ మీట్ కు సంబంధించిన అధికారిక ప్రకటన రానుందని సమాచారం. దీంతో ఆ ప్రెస్ మీట్ లో రాజమౌళి ఎలాంటి విషయాలను మాట్లాడనున్నాడనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఏదేమైనా రాజమౌళి ప్రెస్ మీట్ తర్వాత ఎస్ఎస్ఎంబీ29 సినిమా విషయంలో ఉన్న పలు సందేహాలకు క్లారిటీ వచ్చే అవకాశముంది.

# చిరూ- ఓదెల మూవీ అప్డేట్ ఇచ్చిన నాని!






నేచురల్ స్టార్ నానితో తీసిన దసరా మూవీ ద్వారా మొదటి ప్రయత్నంలోనే డైరెక్టర్ గా మంచి సక్సెస్ అందుకున్నాడు శ్రీకాంత్ ఓదెల. దసరా మూవీ తర్వాత శ్రీకాంత్ కు మంచి డిమాండ్ ఏర్పడింది. శ్రీకాంత్ తర్వాతి సినిమాను ఎవరితో చేస్తాడా అని అందరూ అనుకుంటున్న టైమ్ లో మరోసారి నానితోనే సినిమాను కన్ఫర్మ్ చేసుకుని ది ప్యారడైజ్ అనే సినిమాను తీస్తున్నాడు శ్రీకాంత్. ప్రస్తుతం నానితో ది ప్యారడైజ్ చేస్తున్న శ్రీకాంత్, మెగాస్టార్ చిరంజీవితో ఓ భారీ సినిమాను అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. గతేడాది డిసెంబర్ లోనే ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రకటించారు. హింసలోనే అతడు తన శాంతిని వెతుక్కున్నాడని ప్రీ లుక్ పోస్టర్ ను రిలీజ్ చేసి, ఆ సినిమా చాలా వయొలెంట్ గా తెరకెక్కనుందని క్లారిటీ ఇచ్చాడు.ఆ ప్రీ లుక్ పోస్టర్ చూసిన దగ్గర నుంచి ఈ కాంబినేషన్ లో సినిమా ఎప్పుడెప్పుడు సెట్స్ పైకి వెళ్తుందా అని అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే తాజాగా చిరూ- ఓదెల సినిమాకు సంబంధంచిన ఓ కీలక అప్డేట్ బయటికొచ్చింది. ఈ మూవీకి నేచురల్ స్టార్ నాని సమర్పకునిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. రీసెంట్ గా ఓ మూవీ ఈవెంట్ కు హాజరైన నాని చిరూ-ఓదెల ప్రాజెక్ట్ గురించి మాట్లాడాడు. చిరంజీవితో శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించనున్న మూవీ వచ్చే సంవత్సరంలో ఉంటుందని నాని క్లారిటీ ఇచ్చాడు. ప్రస్తుతం ది ప్యారడైజ్ సినిమాతో బిజీగా ఉన్న శ్రీకాంత్ ఆ సినిమా తర్వాతే చిరూ సినిమాను మొదలుపెట్టనున్నట్టు తెలుస్తోంది. ఈ లోగా చిరంజీవి కూడా వశిష్ట తో చేస్తున్న విశ్వంభరతో పాటూ అనిల్ రావిపూడి సినిమాను కూడా పూర్తి చేసుకుని ఫ్రీ అయిపోతాడు. చిరూ- శ్రీకాంత్ కాంబోలో రానున్న సినిమాను సుధాకర్ చెరుకూరి భారీ బడ్జెట్ తో నిర్మించనున్నాడు. అయితే ఈ సినిమాను శ్రీకాంత్ ఓ పీరియడ్ యాక్షన్ మూవీ చేయనున్నట్టు తెలుస్తోంది.

# మిరాయ్: అనుకున్నట్లే మళ్ళీ వాయిదా.. ఇదే న్యూ డేట్!

టాలీవుడ్ యంగ్ హీరో తేజ సజ్జా.. హనుమాన్ సినిమాతో పాన్ ఇండియా లెవెల్ లో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టి, తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకున్నాడు. ఇప్పుడు ఆ సక్సెస్ పై మరొక అడుగు ముందుకేసే ప్రయత్నంలో, సూపర్ హీరోగా మరో విభిన్నమైన అవతారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. అదే మిరాయ్. ఈ పాన్ ఇండియా మూవీని కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ కలిసి భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. హనుమాన్ తో తేజ సజ్జా హీరోగా బ్యాక్ టూ బ్యాక్ సినిమాలను ఒకే చేస్తున్నాడు కానీ రిలీజ్ విషయంలో మాత్రం స్పీడ్ పెంచడం లేదు. మంచి అవుట్ పుట్ కోసమే అతని దర్శక నిర్మాతలు ఎక్కువ టైమ్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. తప్పకుండా మిరాయ్ కూడా హనుమాన్ రేంజ్ హిట్ అవుతుందనే ధీమాతో ఉన్నారు. అయితే సినిమాను ఈ ఏడాది సమ్మర్ లోనే రిలీజ్ చేయాలని అనుకున్నారు. కానీ అనుకోని కారణాల వలన మళ్ళీ జూన్ కి షిఫ్ట్ చేయాలని చేశారు. ఇక ఇప్పుడు మరికొంత సమయం తీసుకొని న్యూ డేట్ పై క్లారిటీ ఇచ్చారు. మేకర్స్ మిరాయ్ రిలీజ్ డేట్ ను ప్రకటిస్తూ ఒక పవర్ ఫుల్ పోస్టర్ ను కూడా రిలీజ్ చేశారు. ఆగస్టు 1న ప్రపంచవ్యాప్తంగా 8 భాషల్లో, 2డి, 3డి ఫార్మాట్స్ లో మూవీని గ్రాండ్ గా విడుదల చేయనున్నట్టు వెల్లడించారు. రక్షాబంధన్, స్వాతంత్ర్య దినోత్సవం పండుగల సీజన్ లో సినిమా విడుదల కావడంతో, వసూళ్లు కూడా విపరీతంగా పెరగనుండటం ఖాయం. రిలీజ్ డేట్ పోస్టర్ లో తేజ సజ్జా మంచు కొండల మధ్య, చేతిలో తన ఆయుధాన్ని పట్టుకుని దేన్నో చూస్తున్నట్లు చూపించారు. ఈ ఒక్క పోస్టర్ తోనే సినిమా గ్రాండియర్ స్పష్టంగా అర్థమవుతోంది. సినిమా కేవలం తేజ సజ్జా పాత్ర చుట్టూ తిరిగేలా కాకుండా, ప్రతినాయకుడి పాత్రను కూడా అంతే పవర్ ఫుల్ గా డిజైన్ చేశారు. ఆ పాత్రలో సీనియర్ హీరో మంచు మనోజ్ కనిపించనున్నారు. సినిమాలో మంచు మనోజ్ తన విలన్ రోల్ తో ప్రేక్షకులను షాక్ కి గురిచేయనున్నాడని టాక్. హీరోయిన్ గా రితికా నాయక్ నటిస్తుండగా, జగపతి బాబు, శ్రియా శరన్, జయరాం, రాజేంద్ర ప్రసాద్ వంటి స్టార్లు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కార్తీక్ ఘట్టమనేని కేవలం దర్శకుడిగా మాత్రమే కాకుండా, సినిమాటోగ్రాఫర్ గా కూడా ఈ ప్రాజెక్ట్ లో పని చేస్తున్నారు. స్క్రీన్ ప్లే కూడా ఆయనతో పాటు మణిబాబు కరణం కలిసి రాశారుహనుమాన్ ఫేమ్ గౌర హరి సంగీతం అందిస్తుండగా, శ్రీ నాగేంద్ర తంగాల ఆర్ట్ డైరెక్టర్ గా పనిచేస్తున్నారు. వీరందరి కలయికలో సినిమా ఒక డ్రీమ్ ప్రాజెక్ట్ లా రూపొందుతోందనే టాక్ ఇండస్ట్రీ లో వినిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ లో యుద్ధ సన్నివేశాలు, హై లెవెల్ విజువల్స్, అదిరిపోయే బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా, తేజ సజ్జా పాత్రలోని సూపర్ యోధా యాంగిల్, అతని లుక్స్, యాక్షన్ సీక్వెన్సెస్ సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేస్తున్నాయి. మిరాయ్ కోసం తేజ సజ్జా ఫిజికల్ గా కూడా తగిన మార్పులు చేసుకుని, ఫుల్ డెడికేషన్ తో పని చేస్తున్నాడని మూవీ యూనిట్ చెబుతోంది. మరి ఈ సినిమా ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.



# ఇళ్ల మధ్య వైన్ షాపు ఏర్పాటుతో ప్రజా ఆగ్రహం



తిరుపతి రూరల్ (విజయ సారథి):లింగేశ్వర నగర్ పంచాయతీ పరిది లో నివాస గృహల మధ్య వైన్ షాప్ ఏర్పాటును ప్రజలు తీవ్రంగా వ్యతిరే కిస్తున్నారు. శనివారం వైన్ షాప్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్న నిర్మాణం వద్ద స్థానికులు, మహిళలు కలసి వైన్ షాప్ ఏర్పాటు ను అడ్డుకున్నారు.విషయం తెలుసుకున్న లింగేశ్వర నగర్ సర్పంచ్ కోటేశ్వరరావు సంఘటన స్థలం కు వెళ్లి స్థానికులకు మద్దతుగా నిలబడ్డారు.. వైన్ షాప్ ఏర్పాటు కొరకు చేస్తున్న నిర్మాణం పనులు వెంటనే నిలిపివేయాలని సిబ్బంది ని ఆదేశించారు.. పంచాయితీ నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా, ఎక్సైజ్ శాఖ, పోలీసు శాఖ, విద్యుత్ శాఖ అధికారులు. అనుమతులు మంజూరు చేయడం సరికాదని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు ప్రజల కు అండగా నిలబడతానని హామీ ఇవ్వడంతో స్థానికులు శాంతించారు.

## ఈనెల 23వ తేదీన షెడ్యూల్ ప్రకారం యథాతథంగా గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు

### : తప్పుడు ప్రచారం నమ్మొద్దు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్



అనంతపురం(విజయ సారథి):ఫిబ్రవరి 23న ఆదివారం జరగబోయే గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు షెడ్యూల్ ప్రకారం యథాతథంగా జరుగుతాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ పేర్కొన్నారు. ఏపీపీఎస్సీ, గ్రూప్-2 మెయిన్స్ వాయిదా అంటూ సోషల్ మీడియాలో జరుగుతోన్న తప్పుడు ప్రచారం నమ్మొద్దని, ఏపీపీఎస్సీ నుండి అందిన సమాచారం మేరకు గ్రూప్ -2 పరీక్షలు షెడ్యూల్ ప్రకారం యథావిధిగా జరుగుతాయని తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు పేపర్-2 జరుగుతుందని కమిషన్ తెలిపిందని తెలిపారు. అభ్యర్థులు 15 నిమిషాలు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

## పాత్రికేయులకు ఎప్పుడూ తోడుగా ఉంటాం

### ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి

మంత్రాలయం(విజయ సారథి):నియోజకవర్గంలోని పాత్రికేయులకు ఎప్పుడూ తోడుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి భరోసా ఇచ్చారు. ప్రజాశక్తి సీనియర్ పాత్రికేయులు వడ్డే మాధవ్ సతీమణి శ్రీమతి ఇందిర కు ఇటీవల మేజర్ ఆపరేషన్ చేయించుకున్నారు. ఇంటికి క్షేమంగా రావడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి , వైసిపి మండల అధ్యక్షులు జి. భీమారెడ్డి , యువ నాయకులు దశరథ రెడ్డి, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి సభ్యులు వెంకటేష్ శెట్టి వడ్డే మాధవ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ జరిగిన విషయం పై ఆరోగ్య పరిస్థితుల గురించి వివరాలు అడిగి తెలుసుకొని ధైర్యంగా ఉండాలని ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని అధైర్య పడొద్దని ధైర్యం చెప్పారు. ఈ నేపథ్యంలో వడ్డే నారాయణ వారి సోదరులు, కుమారులతో కొద్ది సేపు చర్చించారు.



# బిజెపి శ్రీకాకుళం ఈస్ట్ మండలం సమావేశం



శ్రీకాకుళం(విజయ సారథి):బిజెపి శ్రీకాకుళం నగరం ఈస్ట్ మండలానికి నూతన అధ్యక్షుని నియామకం గురించి అభిప్రాయ సేకరణకు పోలింగ్ బూత్ అధ్యక్షులు, క్రియాశీల సభ్యులు, మండలంలోని సీనియర్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసినట్లుగా బిజెపి శ్రీకాకుళం జిల్లా సహ ఎన్నికల అధికారి, బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యుడు చల్లా వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వర రావు పాల్గొన్నారు. మండలానికి చెందిన సీనియర్ నాయకుడు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతి రావు, సిరిపురం తేజేశ్వర రావు మాట్లాడుతూ తమ ప్రభుత్వం చట్ట సభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించిందని, సంస్థాగతంగా పార్టీ బాధ్యతలలో కూడా మహిళలు 33% ఉండేవిధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. మండల ఎన్నికల అధికారి సురేష్ బాబు సింగ్ మాట్లాడుతూ సంస్థాగత పరంగా మండల అధ్యక్షుని నియామకం కోసం ఈస్ట్ మండలం అర్హత సాధించిందని, మండల అధ్యక్షురాలిగా ఒక మహిళా క్రియాశీల సభ్యురాలకు అందరూ ఏకాభిప్రాయంతో మద్దతు తెలియజేశారని తెలిపారు. త్వరలో అధికారికంగా తన పేరును ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ప్రస్తుత మండలాధ్యక్షుడు పూజారి చెల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతపల్లి దుర్గారావు గాంధి, ఒబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు గొలివి కరుణాకరరావు, డా. పైడి సింధూర, కనుగుల లలిత కుమారి, కద్దాల శ్యామ సుందర రావు, బోర మాధవరావు, ఆరంగి సతీష్, చింతపల్లి విజయ, బలివాడ వెంకట జాహ్నవి, బలగ సాయిదేవి, కలగదండు అప్పలసూరి, పొదిలాపు సూర్యనారాయణ, పల్లా శ్రీరాములు, బొట్ట చిన్నారావు, ఆవల గణేష్ కుమార్, టంకాల రఘూన్సీ తదితరులు పాల్గొన్నారు.చల్లా వెంకటేశ్వర రావుబిజెపి నేషనల్ కౌన్సిల్ మెంబర్బిజెపి శ్రీకాకుళం జిల్లా సహ ఎన్నికల అధికారి

# కలెక్టరేట్లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతి




నంద్యాల(విజయ సారథి):ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, రేనాటి సూర్యుడుగా కొలవబడే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి దేశం కోసం చేసిన త్యాగనిరతిని డిఆర్ఓ రాము నాయక్ కొనియాడారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రెడ్డి సేవా సంఘం ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, మనోహర్ రెడ్డి, తిరుపం రెడ్డి, సాయిరాం రెడ్డి, శివకుమార్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిఆర్ఓ రాము నాయక్ మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులను ఎదిరించి సాయుధ పోరాటం చేసిన విప్లవ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. సాంప్రదాయ వ్యవసాయ వ్యవస్థలో బ్రిటిష్ వారు చేసిన మార్పులకు వ్యతిరేకంగా నరసింహారెడ్డి నిరసన తెలిపారన్నారు. 1806 నవంబర్ 24న కర్నూలు జిల్లాలోని రూపన గుడిలో జన్మించి స్వాతంత్ర సాధన కోసం బ్రిటిష్ పాలకులతో వ్యతిరేకంగా పోరాటం చేసి 1847 ఫిబ్రవరి 22న వీరమరణం పొందా రన్నారు.


# మంత్రాలయం పరిశుభ్రత కు ప్రతి ఒక్కరూ సహకరించాలి




మంత్రాలయం(విజయ సారథి):మంత్రాలయం పరిశుభ్రత కు ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య అన్నారు. శనివారం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్న , రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు మంత్రాలయం గ్రామ పంచాయతీ పరిధిలో ఈవో నాగరాజు ఆధ్వర్యంలో చేపట్టిన చెత్త సేకరణ అవగాహన నిమిత్తం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదోని డిఎల్ పీవో నూర్జహాన్ హాజరై పలు కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులందరూ మా ఊరులో చెత్త సేకరణ కేంద్రం ఉంది పంచాయతీ తరుపున ప్రతి రోజు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి ప్రభావతి, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్ స్వామి, ఎంపీటీసీ సభ్యులు వెంకటేష్ శెట్టి, వెంకటేష్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్సవాలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికలు అందజేత

మంత్రాలయం(విజయ సారథి):శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం లో 1వ తేది నుంచి 6వ తేది వరకు శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుభుధేంద్ర తీర్థ స్వామి వారి ఆధ్వర్యంలో జరిగే గురు భక్తి ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ కర్ణాటక సీఎం సిద్దరామయ్య, కేంద్ర మంత్రి కుమారస్వామి లకు పీఠాధిపతి శ్రీ సుభుధేంద్ర తీర్థ స్వామి వారి ఆదేశాల మేరకు శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ. నరసింహ మూర్తి స్వామి ఆహ్వాన పత్రికలను బెంగళూరు లోని వారి స్వగృహంలో అందజేశారు.



# ఆర్థిక పరిపుష్టితో జిల్లా ముందంజలో సాగడం అభినందనీయం

## కేంద్ర ఆర్థిక సేవారంగ డిప్యూటీ డైరెక్టర్ జెనరల్ ఎం. జి. జయశ్రీ




కడప(విజయ సారథి):ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి సాధనలో భాగంగా.. ఆర్థిక పరిపుష్టితో పాటు అన్ని ప్రమాణికాలలో వైఎస్ఆర్ జిల్లా ముందంజలో కొనసాగడం అభినందనీయం అని.. కేంద్ర ఆర్థిక సేవారంగ డిప్యూటీ డైరెక్టర్ జెనరల్ ఎం. జి. జయశ్రీ అన్నారు.శనివారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అధ్యక్షతన.. ఆకాంక్షిత జిల్లాలో "ఆర్థిక పరిపుష్టి - కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్" అనే అంశంపై బ్యాంకు అధికారులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో.. ప్రత్యేక సమీక్ష సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నుండి... ఆర్థిక సేవారంగ డిప్యూటీ డైరెక్టర్ జెనరల్ ఎం. జి. జయశ్రీ ముఖ్య అతిథిగా హాజరు కాగా.. వారితో పాటు కెనరా బ్యాంక్ డిజిఎం ఆర్తి అగర్వాల్, ఎస్.ఎల్.బి.సి. కన్వీనర్ శ్రీనివాస్ హాజరయ్యారు.ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ జెనరల్ ఎం. జి. జయశ్రీ మాట్లాడుతూ.. ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి సాధనలో భాగంగా ఆర్థిక పరిపుష్టి, నైపుణ్య అభివృద్ధి అనే అంశాల్లో అత్యుత్తమ పనితీరును కనబరిచినందుకు వైఎస్ఆర్ జిల్లాకు కేంద్ర ప్రభుత్వం "నీతీ ఆయోగ్" ద్వారా అత్యుత్తమ పురస్కారం బహుకరించడం అభినందనీయం అన్నారు. దేశవ్యాప్తంగా 112 ఆకాంక్షిత జిల్లాల్లోని 36 జిల్లాలకు ఈ అత్యుత్తమ పురస్కారం వరించగా.. అందులో వైఎస్ఆర్ జిల్లా కూడా ఒకటిగా పురస్కారాన్ని అందుకోవడం గర్వించదగ్గ విషయం అన్నారు. అందుకోసం సంబందిత అన్ని రకాల ప్రమాణికాలలో అత్యుత్తమ సేవలు, అన్ని రకాల లక్ష్యాలను సాధించడంలో జిల్లా యంత్రాంగం చేపట్టిన నిర్దిష్ట ప్రణాళికలు, క్షేత్రస్థాయిలో ఆయా శాఖల జిల్లా అధికారుల కృషి అభినందనీయం అన్నారు. ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనలో ఆర్థిక పరిపుష్టి అనే ప్రమాణిక పాత్ర 10% శాతమే అయినా.. బ్యాంకర్ల సహకారం ఎంతో కీలకమైనదన్నారు. ఇప్పటి వరకు ఆకాంక్షిత జిల్లాల లక్ష్య సాధనలో వైఎస్ఆర్ జిల్లా నోర్దేశించిన అన్ని రంగాల్లో పురోగమనంలో ముందుకు సాగడంపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు. బ్యాంకర్లు సమర్థవంతంగా పని చేస్తేనే.. ఆర్థిక వ్యవస్థ మరింత దృఢంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా జిల్లాలో డీఆర్డీఏ, మెప్మా పరిధిలోని అన్ని స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి.. జిల్లా ఆర్థిక అభివృద్ధిలో మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తున్నాయని... ఈ విషయంలో డిఆర్డీఏ, మెప్మా శాఖల అధికారులు స్వయం సహాయక సంఘాల్లో ఆసక్తిని, బిజినెస్ స్కిల్స్ ను అభివృద్ధి చేయాలన్నారు. అందుకోసం బ్యాంకర్లు పొదుపు సంఘాల మహిళలకు రుణాలు అందించి.. ఆర్థిక చేయుతనివ్వాలన్నారు.జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాలతో పాటు వికలాంగులు, వృద్ధాప్య, ఎఫ్.పి.ఓ., రాగ్ పికర్స్, చిరు వ్యాపారుల గ్రూపులను ఏర్పాటు చేసి.. వారి జీవన ప్రమాణాలను, ఆర్థిక స్థితిని మెరుగు పరచాలన్నారు. సమాజిక భద్రతలో భాగంగా.. వృద్ధాప్య మహిళా సంఘాలను ఏర్పాటు చేసి.. ఆయా సంఘాల పటిష్టతకు కృషి చేయాలన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల కోసం అనేక రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని.. అందుకు సంబంధించి అన్ని రకాల బ్యాంకు శాఖలు ఆయా పట్టణ, గ్రామీణ పరిధిలో రుణ పథకాలకు అర్హత పొందిన లబ్దిదారులకు లబ్ధి చేకూర్చాలని బ్యాంకు అధికారులను సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు, వైద్య ఆరోగ్య శాఖలు, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖ ద్వారా.. వారికి నిర్దేశించిన ప్రమాణికాల ఆధారంగా బ్యాంకుల సహకారంతో జిల్లా ఆర్థిక పరిపుష్టి పెంపొందించాలన్నారు.×× కార్యక్రమంలో ముందుగా జేసీ ఆడితిసింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడం, బ్యాంకింగ్ యాక్సెస్‌ను విస్తరించడం, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడంతో పాటు విస్తృతంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల అమలు వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం, ప్రజలను ఆర్థికంగా చైతన్యవంతం చేయడం, సామాజికంగా శక్తివంతం చేయడంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని, జిల్లా పరిపాలన యంత్రాంగం, ఆయా శాఖల అధికారులు కూడా నిబద్ధతతో పనిచేస్తున్నారన్నారు. జిల్లా ఆర్థిక రాబడులను పెంచే లక్ష్యాలను నిర్దేశించుకుని, అన్ని రంగాల్లో నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి.. మెరుగైన ఉపాధి అవకాశాలను సృష్టించడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన 10 రూపాయల నాణేలను మార్కెట్లో సులభంగా చెలామణి అయ్యేలా వ్యాపారులకు అవగాహన పెంచాలని.. జిల్లా యంత్రాంగం బ్యాంకర్లను ప్రోత్సహించిందన్నారు. జిల్లాలో ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం, ప్రజల సామాజిక-ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడమే లక్ష్యంగా వినూత్న వ్యూహాలతో చురుకైన పాలన సాగించడం జరుగుతోందన్నారు.×× అనంతరం జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలురకాల ఋణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని, ఆకాంక్షిత జిల్లా లక్ష్య సాధనలో భాగంగా కీ పాయింట్ ఇండికేటర్స్ పై ఆయా బ్యాంకుల ప్రతినిధులతో డిప్యూటీ డైరెక్టర్ జెనరల్ సమీక్షించారు. ×× కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ జనార్దనం... సమావేశం కు సంబంధించిన అజెండా, వివరాలను, పలు శాఖల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న రుణాల ప్రగతిని వివరించారు. ఈ సమావేశంలో నాబార్డ్ ఏజీఎం విజయ విహారి, రీజర్వ్ బ్యాంక్ ఎల్డిఓ నవీన్ కుమార్, కెనరా బ్యాంకు ఏజీఎం మురళి మోహన్, ఎస్బిఐ ఎజీఎం వాణీ కిషోర్ కుమార్ రెడ్డి, యూబీఐ ఎజీఎం లక్ష్మీ తులసి, ఏపీజిబి ఎజీఎం శ్రీనివాస ప్రసాద్, డిఆర్డీఏ, మెప్మా పిడీలు ఆనంద్ నాయక్, కిరణ్ కుమార్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డా. శారదమ్మ, పరిశ్రమల శాఖ జీఎం చాంద్ బాషా, వసాయ అనుబంధశాఖల అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రెసిడెన్సీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే

మంత్రాలయం(విజయ సారథి):మండల కేంద్రంలోని రాఘసుధా లో ఆర్ఎంపీ డాక్టర్ అయ్యూబ్ నూతనంగా నిర్మించిన ఓ గా రెసిడెన్సీ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వీరితో పాటు వైస్సార్సీపీ మండల అధ్యక్షులు జి. భీమారెడ్డి , యువ నాయకులు దశరథ రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్ స్వామి , ఎంపిటిసి సభ్యులు వెంకటేష్ శెట్టి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ముందుగా



ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం శాలువ కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు.

PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com